# తొలివార్త

తెలుగు దిన పత్రిక

RNI : TGTEL/25/A0357

ప్రజా గళం మా కలం.....

www.tolivaartha.com

www.epaper.tolivaartha.com








ప్రచురణ : రంగారెడ్డి   ఎడిటర్ : లింగాల నరేందర్ గౌడ్   సంపుటి : 02   సంచిక : 153   గురువారం 08 - 10 - 2026   వెల : 4/-   పేజీలు : 08

Published From : Rangareddy , Circulated at : Hyderabad, Medchal, Malkajgiri, Suryapet, Nalgonda, Jangaon Khammam, Mahaboobnagar, Narayanpet, Warangal , Mancherial




## యాదాద్రి ప్లాంట్‌పై హరీశ్‌కు భట్టి సవాల్

- రూ.40,000 కోట్ల భారం ఎవరిదని ప్రశ్న!
- బొగ్గు లింకేజీ లేకుండానే ప్లాంట్ కట్టి ప్రజలపై రూ.40,000 కోట్ల భారం మోపారని భట్టి ఆరోపణ
- గరిష్ఠ డిమాండ్ ఉన్నా రాష్ట్రంలో కరెంట్ కోతలు లేవని వెల్లడి
- జెన్‌కో, ట్రాన్స్‌కోల ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన డిప్యూటీ సీఎం

**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 07 :** తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై, - మిగతా 2 లో

### తెలంగాణ ప్రభుత్వం దసరా కానుక

# ఉద్యోగులకు రెండు డీఏలు విడుదల

- ఉద్యోగులకు రెండు పెండింగ్ డీఏలు మంజూరు చేసిన తెలంగాణ ప్రభుత్వం
- మొత్తం 6.37 శాతం పెరగనున్న కరువు భత్యం
- అక్టోబర్ జీతంతో కలిపి పెరిగిన డీఏ చెల్లింపు
- ప్రభుత్వంపై ఏటా రూ. 2,500 కోట్ల అదనపు భారం
- 2024 జనవరి నుంచి 2026 సెప్టెంబర్ వరకు పేరుకుపోయిన బకాయిలను జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) ఖాతాల్లో జమ



**తొలివార్త, హైదరాబాద్, అక్టోబర్ 07 :** దసరా పండుగ ముందు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. పెండింగ్‌లో ఉన్న రెండు విడతల కరవు భత్యాన్ని (డీఏ) మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 1వ తేదీన జరిగిన మంత్రిమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం ఈ ఉత్తర్వులను వెలువరించింది.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, 2024 జనవరి 1 నుంచి డీఏ 33.67 శాతం నుంచి 37.31 శాతానికి, 2024 జులై 1 నుంచి 40.04 శాతానికి పెరగనుంది. దీంతో ఉద్యోగుల డీఏ మొత్తం 6.37 శాతం పెరిగినట్లయింది. పెరిగిన డీఏను అక్టోబరు నెల వేతనంతో కలిపి చెల్లించనున్నారు. అంటే నవంబరు 1వ తేదీన ఈ మొత్తం ఉద్యోగుల ఖాతాల్లో జమ కానుంది. 2024 జనవరి నుంచి 2026 సెప్టెంబర్ వరకు పేరుకుపోయిన బకాయిలను జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) ఖాతాల్లో జమ చేస్తారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) పరిధిలోకి వచ్చే వారికి ఈ బకాయిలను విడతల వారీగా చెల్లించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం - మిగతా 2 లో

### ఏ బాధ్యత అప్పగించినా

# శిరసావహిస్తా




- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్
- త్వరలో బీజేపీలో కీలక పదవి అంటూ ప్రచారం
- బండి సంజయ్ నోట ఆసక్తికర మాటలు!
- బీజేపీ తనకు ఎన్నో అవకాశాలు ఇచ్చిందన్న కేంద్ర మంత్రి
- పదవుల కోసం పాకులాడే వ్యక్తి కాదని వెల్లడి

### నా లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు

# వాటిని మెడల్స్ గా భావిస్తా

- కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ
- తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌పై స్పందించిన రాహుల్ గాంధీ
- తనపై ఇప్పటికే 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని వెల్లడి
- 'ఇండియా' కూటమి ఎంపీలతో ఖర్గే భోజన సమావేశం
- ఈసీపై పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయం
- భేటీ అనంతరం జంతర్ మంతర్‌లో నిరసనకు విపక్షాలు సిద్ధం



**తొలివార్త,ఢిల్లీ, అక్టోబర్ 07 :** ఈసీ కార్యాలయం ముట్టడి నేపథ్యంతో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను తేలిగ్గా తీసుకున్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తన లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్ని ఎఫ్ఐఆర్ లు నమోదు చేసుకున్నా తానేమీ వెనుకంజ వేయబోనని, ఆ కేసులను మెడల్స్ గా భావిస్తానని అన్నారు. సీఈసీ పదవికి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందేని - మిగతా 2 లో

### మోదీ నినాదం

# 'మనం సాధించగలం'



- ఐదు లక్ష్యాలు నిర్దేశిస్తూ.. భారతీయులకు సరికొత్త నినాదం ఇచ్చిన ప్రధాని మోదీ
- ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రధాని
- 2047 నాటికి వికసిత భారత్‌తో పాటు ఐదు భారీ లక్ష్యాల ప్రకటన

**తొలివార్త,ఢిల్లీ, అక్టోబర్ 07 :** ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజల్లో సరికొత్త స్ఫూర్తిని నింపుతూ "మనం సాధించగలం" అనే కొత్త నినాదాన్ని ఇచ్చారు. తాను ప్రభుత్వ అధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని, బుధవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా దేశం ముందు ఐదు భారీ లక్ష్యాలను ఉంచి, వాటిని సాధించి తీరాలని పిలుపునిచ్చారు.సరిగ్గా పాతికేళ్ల క్రితం, 2001 అక్టోబర్ 7న నరేంద్ర మోదీ తొలిసారిగా గుజరాత్ - మిగతా 2 లో



## ఢిల్లీలో ఇండియా కూటమి ఎంపీల నిరసన

- నిరసనలో పోలీసులు కిందపడేశారన్న ప్రియాంకగాంధీ
- రాహుల్, ప్రియాంక సహా పలువురు నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్
- రోడ్డుపై పడుకుని నిరసన తెలిపిన ప్రియాంక గాంధీ
- మహిళా పోలీసులు తనను తోసేశారని ప్రియాంక ఆరోపణ

**తొలివార్త,ఢిల్లీ, అక్టోబర్ 07 :** ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపీలు - మిగతా 2 లో

## కుమార్తె పెళ్లికి తమిళనాడు సీఎం విజయ్‌ను ఆహ్వానించిన వైఎస్ షర్మిల

- తమిళనాడు సీఎం విజయ్‌తో ఏపీసీసీ చీఫ్ షర్మిల భేటీ
- భర్త అనిల్ కుమార్‌తో కలిసి సీఎంను కలిసిన షర్మిల
- కుమార్తె అంజలి రెడ్డి వివాహానికి విజయ్‌ను ఆహ్వానించిన దంపతులు
- వివాహ పత్రిక అందించి వేడుకకు రావాల్సిందిగా విజ్ఞప్తి



**తొలివార్త,చెన్నై, అక్టోబర్ 07 :** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, తమిళనాడు ముఖ్యమంత్రి - మిగతా 2 లో

### సిర్పూర్-కాగజ్‌నగర్

## రైలులో మంటలు

- సిర్పూర్-కాగజ్‌నగర్ రైలులో స్వల్ప అగ్నిప్రమాదం
- యాదాద్రి జిల్లా బీబీనగర్ సమీపంలో ఘటన
- బ్రేక్ లైనర్, చక్రం రాపిడితో చెలరేగిన మంటలు
- ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదని వెల్లడి
- మరమ్మతుల తర్వాత రైలు తిరిగి ప్రయాణం - మిగతా 2 లో

### 12 అజెండా అంశాలకు

# కేబినెట్ ఆమోదం



- ఉద్యాన రంగానికి డిజిటల్ ఊతం
- హార్టికల్చర్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటు
- కేబినెట్ నిర్ణయాలివే
- విద్య, గిరిజన విద్య, భూములు, దేవాదాయశాఖలకు సంబంధించిన ప్రతిపాదనలు అజెండాలో ఉన్నాయి

**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 07 :** ప్రధాని నరేంద్రమోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని అభినందిస్తూ ఏపీ మంత్రివర్గం ఏకగ్రీవ తీర్మానం చేసింది. మోదీపై అభినందన తీర్మానాన్ని మంత్రి నారా లోకేశ్ ప్రవేశపెట్టి చదివారు. మోదీ సేవలను గుర్తు చేస్తూ పలువురు మంత్రులు మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన దాదాపు మూడు గంటల పాటు సాగిన కేబినెట్ భేటీలో 12 అజెండా అంశాలకు ఆమోదం తెలిపారు.విదేశీ యూనివర్సిటీల క్యాంపస్‌లకు మార్గం సుగమం చేస్తూ 2026 ఉన్నత విద్యా పాలసీకి, విద్యా చట్ట సవరణకు రాష్ట్ర మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆశా కార్యకర్తల గ్రాట్యుటీ పెంచేందుకు అమాత్యులు అంగీకారం తెలిపారు. రేపల్లె ఆసుపత్రి అప్‌గ్రేడ్, గిరిజన విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ వంటి - మిగతా 2 లో

### ప్రజల మాట వింటేనే ఎక్కువకాలం

# జనంలో ఉంటారు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- కేబినెట్ భేటీ అనంతరం చంద్రబాబు, మంత్రులతో పలు అంశాలపై చర్చించారు
- జగనన్న కాలనీల్లో ఖాళీ ప్లాట్లు ఉంటే ఇతరులకు కేటాయించాలని సీఎం ఆదేశించారు
- కర్మయోగి కార్యక్రమంలో భాగంగా సిబ్బందికి మంత్రులు శిక్షణ ఇవ్వాలని సూచించారు



**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 07 :** సచివాలయంలో మంత్రివర్గ భేటీ అనంతరం తాజా పరిమాణాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. జగనన్న కాలనీల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లకు ఇక కొత్త కేటాయింపులు, లబ్ధిదారులకు మరింత వెసులుబాటు కల్పించేలా కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఇల్లు కట్టుకునేందుకు ఆసక్తి ఉన్నవారికి ప్లాట్లు ఇవ్వాలని చెప్పారు. ప్లాట్లు దక్కిన వారు తమకు అక్కర్లేదంటే మరో ప్రాంతంలో ఇవ్వాలని ఆదేశించారు. కర్మయోగి కార్యక్రమంలో భాగంగా మంత్రులు తమ శాఖల సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని చంద్రబాబు సూచించారు.మోదీని 'రైట్ టైమ్- రైట్ ప్లేస్- రైట్ లీడర్'గా చంద్రబాబు అభివర్ణించారు. నరేంద్ర మోదీ కార్యక్రమాలపై నిరంతరం ఫీడ్‌బ్యాక్ తీసుకుంటారని మంత్రి లోకేశ్ తెలిపారు. ప్రధానిగా ఉన్నప్పటికీ అందరి అభిప్రాయాలను మోదీ వింటారని సీఎం అన్నారు. మంత్రులు కూడా ప్రజలు చెప్పే విషయాలను శ్రద్ధగా విని సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. నాయకుడు ప్రజల మాట వింటేనే ఎక్కువకాలం జనంలో ఉండగలరని పేర్కొన్నారు. కేబినెట్ నిర్ణయాలను కలెక్టర్లకు వివరించి క్షేత్రస్థాయిలో సమీక్షించాలని చెప్పారు.స్వయం ఉపాధి సంఘాల వద్ద ఉన్న రూ.30,000 కోట్ల - మిగతా 2 లో



## ఏపీలో కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు

- కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు
- కుప్పం, శ్రీకాకుళం విమానాశ్రయాలకు భూసేకరణ పూర్తయిందన్న రామ్మోహన్ నాయుడు
- భోగాపురం ఎయిర్‌పోర్టుతో పారిశ్రామికంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని ధీమా
- విశాఖ ఎకనామిక్ రీజియన్ త్వరలోనే వాస్తవరూపం దాల్చుతుందన్న కేంద్ర మంత్రి

**తొలివార్త,అమరావతి, అక్టోబర్ 07 :** ఏపీలో కొత్త విమానాశ్రయాలను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. శ్రీకాకుళం, కుప్పం, నాగార్జున సాగర్ సమీపంలో, అమరావతి వంటి ప్రాంతాల్లో ఈ నూతన విమానాశ్రయాలు రానున్నాయని చెప్పారు. ఇప్పటికే శ్రీకాకుళం, కుప్పం ఎయిర్‌పోర్టులకు భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని మంత్రి - మిగతా 2 లో

# సంపాదకీయం

## చేరలేని నేటి కవిత



కేవలం కవులమనిపించుకోవాలన్న వ్యామోహం తప్ప తగిన నేపథ్యం, అవగాహన లేని వాళ్ళు ఎగబడటం వల్ల వచన కవితా ప్రక్రియ నిరర్థకమవుతోంది. ఛందోబందోబస్తులు, వ్యాకరణ నియమాలు మొదలైన సంకెళ్లను తెంచుకొని విషయాన్ని సూటిగా పారదర్శకంగా పాఠకుల కందించాలనే లక్ష్యంతో వచన కవిత ఆవిర్భవించింది. అయితే అది అతి సులభమైన ప్రక్రియ అనే అభిప్రాయంతో ఔత్సాహిక కవులు ఉత్సహపడటం వల్ల మౌలిక ప్రయోజనాన్ని, సాహిత్య గౌరవాన్ని కోల్పోతుంది. ఆధునిక కవితలు రాయడానికి నవ్య కవిత్వం చదివితే చాలు అనే కొందరు అతివాదుల ఉపన్యాసాలు కూడా యువకవులను పెడదోవ పట్టిస్తున్నాయి.ఏ కాలంలోనైనా కవికి ప్రతిభ, సృజనాత్మక శక్తి, భాష మీద అధికారం అవసరం. కొందరు ప్రసిద్ధ కవులు కూడా పాశ్చాత్య కవిత్వ ప్రభావంతో ప్రయోగాలు చెయ్యడం వల్ల ఆధునిక తెలుగు కవితల్లో మార్మికత, అస్పష్టత చోటు చేసుకుంటున్నాయి. "నా తల్లో పాదాలు మొలుస్తాయి/ పాదాల్లోంచి తోటలు లేస్తాయి/ తోటల్లోంచి సముద్రాలు వీస్తాయి..." -- ఇలాంటి కవితలు ఎవరికి అర్థమవుతాయి? ఏ ప్రయోజనాన్ని సాధిస్తాయి? ప్రాచీన కవిత్వంలో సంస్కృత పదబాహుళ్యం, అర్థం కాని సంధులూ సమాసాలూ వున్నాయని నిరసించి ఆధునిక కవిత్వాన్ని ఆదరించే సాహితీ ప్రియులకివి ఆశాభంగాలు కావా? "కవిత్వంలో అబ్స్క్యూరిటీ కొన్ని సందర్భాలలో ఉండొచ్చును.. అది ట్రాన్సపరెంట్ చీకటై ఉండాలి, నిన్ను పలకరించాలి" అనే తిలక్ నిర్వచనానికి ఇలాంటివి మింగుడుపడవు.రాసినవాళ్ళే తమ ఉద్దేశ్యాన్ని, అన్వయాన్ని స్పష్టంగా వివరించలేని కొన్ని వచన కవితల కంటే సామాజిక చైతన్యం విషయంలో మినీ కవితలు, గజళ్లు, ఉద్యమ కవితలు మేలనిపిస్తున్నాయి. ఇంకా తెలుగువారి ఆస్తి అయిన పద్యాలను కూడా నిర్లక్ష్యం చెయ్యడం సరికాదు. వేమన, సుమతి వంటి శతకాల్లోని పద్యాలు, పౌరాణిక నాటకాల్లోని పద్యాలు, జాషువా కరుణశ్రీ వంటి వారి కలాలు జాలువార్చిన పద్యాలు తెలుగు వారి నోళ్లలో నానడం లేదా? ఆ మాటకొస్తే వ్యాపార ప్రధానాలైన సినిమాల్లోని పాటలు కూడా నిరక్షరాస్యులను సైతం ప్రభావితం చెయ్యడం లేదా?జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత సి. నారాయణరెడ్డి తను సినిమాలకు రాసిన పాటలు అనుషంగికాలని ప్రకటించినా, అవి ఆయన కావ్యాలకు మించిన ప్రయోజనాన్ని ప్రచారాన్ని పొందాయి. అలాగే 'వెలుగునీడలు' చిత్రం కోసం శ్రీశ్రీ రాసిన "కల కానిది, విలువైనది, బ్రతుకు..." అనే పాట ఆత్మహత్యకు పూనుకున్న ఒక వ్యక్తిని బతికించడం కంటే ఏ సాహిత్య ప్రక్రియకైనా విలువైనదేముంటుంది. 'మురళీకృష్ణ' చిత్రంలో ఆత్రేయ రాసిన "అనుకున్నామని జరగవు అన్నీ, అనుకోలేదని ఆగవు కొన్ని, జరిగేవన్నీ మంచికని, అనుకోవడమే మనిషి పని..." వంటి సందేశాలు ఎంతమంది ఆశోపహతుల్ని ఓదార్చవు? 'పెళ్ళిపుస్తకం' చిత్రానికి ఆరుద్ర రాసిన పాటలో "అడుగడుగున తొలి పలుకులు గుర్తు చేసుకో, తడబడితే పొరబడితే తప్పుదిద్దుకో" అనే పంక్తులు దాంపత్య జీవితంలోని అపశ్రుతులను చక్కదిద్దే ఆణిముత్యాలు కావా? -- ఇవి సినిమా పాటల ప్రభావానికి చెందిన కొన్ని ఉదాహరణలు మాత్రమే.ఈనాడు ఎన్నో సాహిత్య సంస్థలు నవలల, కథల పోటీలతో పాటు కవితల పోటీలు కూడా నిర్వహించి ఉత్తమ కవితలకు బహుమతులు అందచేస్తున్నాయి. ఈ తరుణంలో అవకాశాలను అందిపుచ్చుకుని వచనక కవితా ప్రక్రియ లక్ష్యాన్ని ప్రయోజనాన్ని యువతరం కవులు నిలుపుతారని ఆశిద్దాం.

# 12 అజెండా అంశాలకు కేబినెట్ ఆమోదం



**మొదటిపేజీ తరువాయి -** ప్రతిపాదనలకూ కేబినెట్ ఆమోదం తెలిపింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ క్రమంలో కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. 12 అంశాలపై ఆమోదం, సవరణలు, నిర్ణయాలతో పాటు పలు ఉత్తర్వులకు రాటిఫికేషన్ ఇచ్చింది.ఉద్యాన రంగాన్ని డిజిటల్ బాట పట్టించే ఏపీహెచ్ఎంఎస్ వ్యవస్థకు ఆమోదం లభించింది. క్యూసీబీఎస్ విధానంలో ఎంపికైన వాసర్ ల్యాబ్స్ ఐటీ సొల్యూషన్స్‌కు రూ.20.62 కోట్లతో ప్రాజెక్టును అప్పగించనున్నారు. ఇందులో రూ.11.77 కోట్లు అభివృద్ధి వ్యయానికి, రూ.8.85 కోట్లు ఐదేళ్ల నిర్వహణ, సేవలకు కేటాయించారు. మొత్తం 72 నెలల పాటు ప్రాజెక్టు అమలు కానుంది. ఆశా కార్యకర్తలకు సామాజిక భద్రత కల్పించేలా కీలక నిర్ణయం తీసుకున్నారు.సేవలో ఉండగానే మరణించే అర్హత కలిగిన ఆశా కార్యకర్తలకు సంవత్సరానికి రూ.5 వేల చొప్పున గ్రాట్యుటీ చెల్లించనున్నారు. ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు అందుతుంది. ఇందుకు అవసరమైన నిధులను ప్రతి ఏడాది బడ్జెట్‌లో కేటాయించేందుకు అనుమతి ఇచ్చారు. బాపట్ల జిల్లా రేపల్లెలోని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి ఆమోదం తెలిపారు. ఇందుకు రూ.58.42 కోట్ల అంచనా వ్యయం కేటాయించనున్నారు. 66 అదనపు పోస్టుల మంజూరుకు కూడా కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.గిరిజన విద్యార్థులకు రెసిడెన్షియల్ కోచింగ్: విద్య, సంక్షేమ రంగాలకు సంబంధించి ఇప్పటికే జారీ చేసిన పలు ఉత్తర్వులకు కేబినెట్ రాటిఫికేషన్ ఇచ్చింది. తల్లికి వందనం పథకం 2026-27 మార్గదర్శకాలు, పరిపాలనా అనుమతులకు సంబంధించిన ఉత్తర్వులకు ఆమోదం తెలిపింది. సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో డైట్ ఛార్జీల పెంపు ఉత్తర్వులను కూడా రాటిఫై చేసింది. గిరిజన విద్యార్థులకు పోటీ పరీక్షల శిక్షణను మరింత బలోపేతం చేయనున్నారు. విశాఖపట్నం మరికవలసలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులకు కేబినెట్ ఆమోదించింది. ఐఐటీ-జేఈఈ, నీట్ కోసం గిరిజన విద్యార్థులకు ఇంటెన్సివ్ రెసిడెన్షియల్ కోచింగ్ అందించనున్నారు.కుప్పం అభివృద్ధికి అవసరమైన భూ కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలం నక్కనపల్లెలో 1.69 ఎకరాల గ్రేజింగ్ గ్రౌండ్ పోరంబోకు భూమి వర్గీకరణను మార్చి కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి అప్పగించనున్నారు. ఈ స్థలంలో అధికారుల అతిథి గృహం నిర్మించనున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న ప్రభుత్వ పోరంబోకు భూముల ఆక్రమణల క్రమబద్ధీకరణకు సంబంధించిన ఉత్తర్వులకు రెవెన్యూ శాఖ రాటిఫికేషన్ లభించింది. వన్‌టైమ్ చర్యగా అసలు అసైనీలు, వారి చట్టపరమైన వారసులు, మూడో వ్యక్తుల కొనుగోలుదారులు, ఇతర ఆక్రమణదారుల భూముల వర్గీకరణ మార్పు, క్రమబద్ధీకరణకు సంబంధించిన ఉత్తర్వులకు ఆమోదం తెలిపారు.దేవాదాయ శాఖకు భూమి బదలాయింపునకూ కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వైఎస్సార్ కడప జిల్లా నందలూరు మండలం పొతూరులోని శ్రీ కన్నేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం 7.66 ఎకరాల ప్రభుత్వ భూమిని బదలాయించనున్నారు. భూమి విలువ రూ.60.20 లక్షలుగా అంచనా వేశారు. ఉడా ఎన్‌వోసీ, ఇతర నిబంధనలకు లోబడి ఉచితంగా లేదా మార్కెట్ విలువ చెల్లింపు ప్రాతిపదికన భూమి బదలాయింపును చేపట్టనున్నారు. ప్రకాశం జిల్లాలో గిరిజన, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు వసతి విద్యకు మరో అడుగు పడింది. కొండపి మండలం కేజీకే కండ్రికలోని 7 ఎకరాల వాగు పోరంబోకు భూమిని అసెస్డ్ వేస్ట్‌గా వర్గీకరణ మార్చేందుకు ఆమోదం తెలిపారు. ఈ భూమిని ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్ బాలుర రెసిడెన్షియల్ స్కూల్, హాస్టల్ ఏర్పాటుకు వినియోగించనున్నారు.

## నా లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు, వాటిని మెడల్స్ గా భావిస్తా

**మొదటిపేజీ తరువాయి -** పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో నేడు జన్‌పథ్‌లోని సాగర్ రత్న రెస్టారెంట్‌లో విపక్ష ఎంపీల భోజన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని, 'ఓట్ల దొంగతనం' అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా మాట్లాడుతూ.. 'ఇది లంచ్ మాత్రమే కాదు, ఒక లాంచ్ కూడా కావచ్చు' అని చమత్కరించారు.కాగా, మంవారం 'ఓట్ల దొంగతనం' జరిగిందంటూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిన్న విపక్ష ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయానికి ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు నేతలు ఆకాశవాణి భవన్‌లోకి ప్రవేశించి సుమారు 8 గంటల పాటు బైఠాయించారు. అనుమతి లేకుండా భవనంలోకి ప్రవేశించినందుకు పోలీసులు వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.ఈ ఎఫ్ఐఆర్‌పై స్పందిస్తూ రాహుల్ గాంధీ, "నాపై ఇప్పటికే 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయి. నా లక్ష్యం 100" అని తేలికగా వ్యాఖ్యానించారు. భోజన భేటీ అనంతరం, ఎంపీలందరూ జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపేందుకు సిద్ధంగా ఉన్న బస్సుల్లో బయలుదేరారు. మోదీ, అమిత్ షా, మోహన్ భగవత్, జ్ఞానేశ్ కుమార్ కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. ఈ పరిణామాల నేపథ్యంలో, పోలీసులు జంతర్ మంతర్, ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లే మార్గాల్లో భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు.

## కుమార్తె పెళ్లికి తమిళనాడు సీఎం విజయ్‌ను ఆహ్వానించిన వైఎస్ షర్మిల

**మొదటిపేజీ తరువాయి -**

విజయ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తన కుమార్తె వివాహ వేడుకకు ఆయన్ను ఆహ్వానించేందుకు షర్మిల తన భర్త అనిల్ కుమార్‌తో కలిసి నేడు చెన్నై వెళ్లారు. అక్కడ ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం విజయ్‌ను నేరుగా కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు.వచ్చే నెల 25న తన కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి వివాహం జరగనున్నట్లు షర్మిల తెలిపారు. ఈ వేడుకకు కుటుంబ సమేతంగా హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించాలని సీఎం విజయ్‌ను సాదరంగా కోరారు. ఈ సమావేశం అనంతరం షర్మిల సోషల్ మీడియా వేదికగా తన సంతోషాన్ని పంచుకున్నారు.తమకు సమయం కేటాయించిన సీఎం విజయ్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఆయన చూపిన ఆప్యాయత, అనురాగం ఎంతో ఆనందాన్ని కలిగించాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాబోయే దంపతులకు సీఎం విజయ్ తన శుభాకాంక్షలు తెలియజేసినట్లు వైఎస్ షర్మిల వివరించారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## మోదీ నినాదం 'మనం సాధించగలం'

**మొదటిపేజీ తరువాయి -** ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కేశూభాయ్ పటేల్ తర్వాత రాష్ట్ర 14వ ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ ప్రత్యేకమైన రోజును కేవలం జ్ఞాపకాలకే పరిమితం చేయకుండా, దేశం కోసం కొత్త సంకల్పం తీసుకునే రోజుగా ఆయన మలిచారు. "ఈ రోజు కేవలం గతాన్ని స్మరించుకునేది మాత్రమే కాదు, మన సంకల్పంలో కొత్త శక్తిని నింపే రోజు. మనం ఏదైనా సాధించగలమనే వాగ్దానాన్ని పునరుద్ఘాటించే రోజు" అని మోదీ పేర్కొన్నారు.ఈ సందర్భంగా, 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యంతో పాటు మరో ఐదు కీలక లక్ష్యాలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల ముందుంచారు. అవి:

1. ప్రపంచంలోని మొదటి మూడు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్‌ను నిలపడం.
2. ఆత్మనిర్భర్ భారత్ (స్వయం సమృద్ధి) సాధించడం.
3. భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దడం.4. ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడం. 5. అంతరిక్షంలోకి మానవసహిత యాత్రను చేపట్టడం.ప్రధాని మోదీ ఒక్కో లక్ష్యాన్ని ప్రకటిస్తున్నప్పుడు, స్టేడియంలోని వేలాది మంది ప్రజలు "మనం సాధించగలం" అంటూ మిన్నంటేలా నినదించారు. ఈ ఉత్సాహం, ఆత్మవిశ్వాసం అసాధారణమైనవని ప్రధాని ప్రశంసించారు.గతంలో సంక్షోభాలు తలెత్తినప్పుడు భారత ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యేదని, కానీ నేడు సంక్షోభ సమయాల్లో భారత్ చూపుతున్న పటిష్ఠత, స్థితిస్థాపకత గురించి ప్రపంచం చర్చించుకుంటోందని మోదీ అన్నారు. "ఒకప్పుడు దేశంలో విధానపరమైన స్తబ్దత గురించి చర్చ జరిగేది. నేడు సంస్కరణల ఎక్స్‌ప్రెస్ గురించి మాట్లాడుకుంటున్నారు" అంటూ అప్పటి యూపీఏ-2 ప్రభుత్వాన్ని ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. చిన్న లక్ష్యాలు పెట్టుకోవడం దేశ సామర్థ్యాన్ని తక్కువ చేయడమేనని, అందుకే భారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ లక్ష్యాలన్నీ 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకేనని మోదీ స్పష్టం చేశారు.ం

## సిర్పూర్-కాగజ్‌నగర్ రైలులో మంటలు

**మొదటిపేజీ తరువాయి -** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ సమీపంలో బుధవారం ఉదయం సిర్పూర్-కాగజ్‌నగర్ వెళుతున్న రైలులో స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనతో ప్రయాణికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. అయితే, రైల్వే సిబ్బంది అప్రమత్తతతో వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది.వివరాల్లోకి వెళితే, రైలు బీబీనగర్ స్టేషన్ సమీపానికి చేరుకుంటున్న క్రమంలో, ఒక బోగీ చక్రానికి బ్రేక్ లైనర్‌లు పట్టేయడంతో ఏర్పడిన రాపిడి వల్ల పొగలు, మంటలు చెలరేగాయి. దీనిని వెంటనే గమనించిన కో-పైలట్, లోకో పైలట్‌ను అప్రమత్తంచేయడంతో రైలును బీబీనగర్ రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు.సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది, అగ్నిమాపక దళం హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ప్రయాణికులెవరికీ ఎటువంటి గాయాలు కాలేదని అధికారులు స్పష్టం చేశారు. అనంతరం సాంకేతిక సిబ్బంది అవసరమైన మరమ్మతులు పూర్తి చేయడంతో రైలు తిరిగి సిర్పూర్-కాగజ్‌నగర్‌కు బయలుదేరింది. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

# ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తా

**మొదటిపేజీ తరువాయి -**

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు త్వరలో తెలంగాణ బీజేపీలో కీలక బాధ్యతలు అప్పగించనున్నారనే ప్రచారం జరుగుతున్న వేళ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ తనకు ఎన్నో పదవులు, అవకాశాలు ఇచ్చిందని చెప్పారు. తాను పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదన్నారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానని, కార్యకర్తగా పార్టీ కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు.ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని బీజేపీ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో 'సేవా జ్యోతి' ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన బండి సంజయ్.. కేసీఆర్ భూ వివాదాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పడం అంతా డ్రామానేనని విమర్శించారు. బీఆర్ఎస్ అవినీతిపై చర్యలు తీసుకునే దమ్ము కాంగ్రెస్‌కు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై పోరాడే సత్తా బీఆర్ఎస్‌కు లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు.ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ సహా విపక్షాలు చేస్తున్న విమర్శలపై బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. 'ఓట్ చోరీ, సీట్ చోరీ' పేటెంట్ కాంగ్రెస్‌కే ఉందని ఆరోపించారు. 1946లో కాంగ్రెస్ పీసీసీలన్నీ సర్దార్ పటేల్ ప్రధాని కావాలని ప్రతిపాదించినా.. నెహ్రూను ప్రధాని చేశారని విమర్శించారు. దేశంలో బోగస్ ఓట్లు ఉన్నాయని కాంగ్రెస్సే చెప్పిందని, ఇప్పుడు వాటిని తొలగిస్తుంటే ఎందుకు అభ్యంతరం చెబుతోందని ప్రశ్నించారు.ప్రధాని మోదీకి ఓటు, సీటు చోరీ చేయాల్సిన అవసరం లేదన్నారు. కుటుంబం, బినామీ ఆస్తులు, వారసత్వ రాజకీయాలు ఆయనకు అవసరం లేదని చెప్పారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ పనిచేస్తున్నారని పేర్కొన్నారు.కాంగ్రెస్ సహా కొన్ని పార్టీలు చెప్పే మాటలు నమ్మి యువత మోసపోవద్దని బండి సంజయ్ సూచించారు. 2014కు ముందు, ఇప్పటి భారత్‌ను పోల్చి చూడాలని కోరారు. ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ సంస్థ అని, అది బీజేపీ జేబు సంస్థ కాదన్నారు. రాజ్యాంగ సంస్థను బదనాం చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు.ఎన్నికల సంఘాన్ని కలవాలంటే అపాయింట్‌మెంట్ తీసుకోవాలని రాహుల్ గాంధీకి సూచించారు. వందల మందితో వెళ్లి దాడి చేస్తే పోలీసులు అడ్డుకోక ఏం చేస్తారని ప్రశ్నించారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు అనర్హుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడమే ఎస్ఐఆర్ లక్ష్యమన్నారు.తెలంగాణలో అక్రమ చొరబాటుదారుల ఓట్లపై కూడా బండి సంజయ్ ఆరోపణలు చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలోనే 30 వేలకు పైగా రోహింగ్యాల ఓట్లు ఉన్నాయని అన్నారు.

## ఏపీలో కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు

**మొదటిపేజీ తరువాయి -** స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంతో ఉత్తరాంధ్ర ప్రాంతం ఒక మినీ ఎకనామిక్ సిటీగా రూపాంతరం చెందనుందని కేంద్ర మంత్రి అన్నారు. ఈ ఎయిర్‌పోర్టు ఈ ప్రాంత అభివృద్ధికి ఒక చోదకశక్తిగా పనిచేస్తుందని, వలసలను నివారించడంలో కీలకపాత్ర పోషిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.ఉత్తరాంధ్రలో భారీ పారిశ్రామిక అభివృద్ధి జరగనుందని, భోగాపురం విమానాశ్రయం ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణంగా నిలుస్తుందని ఆయన అభివర్ణించారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'విశాఖ ఎకనామిక్ రీజియన్' కూడా త్వరలోనే వాస్తవరూపం దాల్చనుందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

## ప్రజల మాట వింటేనే ఎక్కువకాలం జనంలో ఉంటారు

**మొదటిపేజీ తరువాయి -** కార్పస్ నిధులను ప్రస్తావిస్తూ మిగిలిన గ్రూపులను కూడా ఆ స్థాయికి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు. కుప్పంలో ఇజ్రాయెల్ సాంకేతికతతో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలన్న తన ఆలోచనను గుర్తు చేసిన చంద్రబాబు, అదే సాంకేతికతను మోదీ గుజరాత్‌లో విజయవంతంగా అమలు చేయించారని తెలిపారు. కేబినెట్‌కు నలుగురు మంత్రులు గైర్హాజరైన అంశంపై మీడియా కథనాలను సీఎం ప్రస్తావించారు. అమాత్యులు రాకపోవడానికి కారణాలు తనకు తెలుసని, ఇకపై అన్ని విషయాలను మీడియాకు స్పష్టంగా వివరించాలని ముఖ్యమంత్రి సూచించారు.మరోవైపు సీఎం చంద్రబాబుతో మంత్రి నారాయణ సమావేశమయ్యారు. రాజధానిలో కేటగిరి-4, ఎండోమెంట్ భూముల అంశంపై చర్చించారు. వీటిపై స్పందించిన ముఖ్యమంత్రి భూములకు సంబంధించిన న్యాయపరమైన అంశాలను పరిశీలించిన తర్వాత మరోసారి తన దృష్టికి తీసుకురావాలని నారాయణకు తెలిపారు.

## తెలంగాణ ప్రభుత్వం దసరా కానుక ఉద్యోగులకు రెండు డీఏలు విడుదల



**మొదటిపేజీ తరువాయి -** చేసింది.ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వ ఖజానాపై ఏటా సుమారు రూ. 2,500 కోట్ల అదనపు భారం పడనుందని అంచనా. కేవలం బకాయిల చెల్లింపు కోసమే దాదాపు రూ. 6,174 కోట్లు అవసరమవుతాయి. తాజా పెంపుతో రాష్ట్రంలోని సుమారు 7 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లు, ఇతర అర్హత కలిగిన సిబ్బంది లబ్ధి పొందనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు, ఆర్థిక భారం ఉన్నప్పటికీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇప్పటికే వెల్లడించారు.

# యాదాద్రి ప్లాంట్‌పై హరీశ్‌కు భట్టి సవాల్

**మొదటిపేజీ తరువాయి -** మాజీ మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు గుప్పించారు. బొగ్గు సరఫరాకు సరైన ఏర్పాట్లు చేయకుండానే ప్లాంట్‌ను నిర్మించి రాష్ట్ర ప్రజలపై రూ.40,000 కోట్ల భారం మోపారని ఆరోపించారు. ఈ తప్పిదాలకు ఎవరు బాధ్యత వహించాలని ఆయన సూటిగా ప్రశ్నించారు.ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరిందని తెలిపారు. ఇంతటి డిమాండ్ ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఎలాంటి కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తోందని స్పష్టం చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే, ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి అసత్యాలు ప్రచారం చేయడం సరికాదన్నారు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు ఇలా బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం తగదని హితవు పలికారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి నుంచి బొగ్గు లింకేజీ ఇస్తామని హామీ ఇచ్చి యాదాద్రి ప్లాంట్‌ను ప్రారంభించిందని, కానీ ప్లాంట్‌కు అవసరమైన జీ9 గ్రేడ్ బొగ్గు సింగరేణిలో అందుబాటులో లేదని భట్టి గుర్తుచేశారు. సింగరేణి నుంచి 7 మిలియన్ టన్నులు, మిగిలింది దిగుమతి చేసుకుంటామని ఒప్పందాలు చేసుకున్నా, బీఆర్ఎస్ హయాంలో వాటిని నెరవేర్చలేదని విమర్శించారు. బొగ్గు అనుసంధానం లేకుండానే ప్లాంట్‌ను నిర్మించారా లేదా అనే దానిపై హరీశ్‌రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బొగ్గు సరఫరాకు ఏర్పాట్లు చేసి మూడు యూనిట్లను ప్రారంభించిందని భట్టి వివరించారు. జెన్‌కో, ట్రాన్స్‌కోలను ప్రైవేటీకరిస్తారంటూ వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే ప్రతిపక్షాలు విద్యుత్ అంశంపై రాద్ధాంతం చేస్తున్నాయని, తమ ప్రభుత్వానికి ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు.

# నిరసనలో పోలీసులు కిందపడేశారన్న ప్రియాంకగాంధీ



**మొదటిపేజీ తరువాయి -** బుధవారం ఢిల్లీలో చేపట్టిన నిరసన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. జంతర్ మంతర్ వద్ద ధర్నాకు వెళుతున్న నేతలను పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ హైడ్రామా చోటుచేసుకుంది. ఈ క్రమంలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.'ఓట్ల చోరీ' జరిగిందని ఆరోపిస్తూ, సీఈసీని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఎంపీలు ఈ నిరసనకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఏర్పాటు చేసిన సౌహార్ద విందు అనంతరం ఎంపీలందరూ బస్సుల్లో జంతర్ మంతర్‌కు బయలుదేరారు. అయితే, మార్గమధ్యంలో అశోకా రోడ్డు వద్ద పోలీసులు భారీ భద్రతా వలయంతో బస్సులను నిలువరించారు. దీంతో ఎంపీలు రోడ్డుపైనే బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో ప్రియాంక గాంధీ, మరికొందరు మహిళా ఎంపీలు రోడ్డుపై పడుకుని తమ నిరసనను వ్యక్తం చేశారు. పోలీసులు వారిని బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. తనను అదుపులోకి తీసుకునే క్రమంలో మహిళా పోలీసులు కిందకు తోసేసి, గాయపరిచారని ప్రియాంక గాంధీ ఆరోపించారు. రాహుల్ గాంధీని కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనంలో తరలించారు.కొందరు ఎంపీలు బస్సుల పైకెక్కి జాతీయ జెండాలు ఊపుతూ నిరసన తెలిపారు. ఈ ఆందోళనలో కాంగ్రెస్, టీఎంసీ, సీపీఎం, సీపీఐ, ఆర్జేడీ, ఐయూఎంఎల్ పార్టీల ఎంపీలు పాల్గొనగా, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలు గైర్హాజరు కావడం గమనార్హం.

తొలివార్త
RNI : TGTEL/25/A0357
గురువారం 08 - 10 - 2026

# నూతన సీఐ సట్ల రాజును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన

**రాష్ట్ర పెరిక కార్పొరేషన్ వైస్ చైర్మన్ బుడగం శ్రీనివాస్**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 07 ( తొలివార్త ):** భద్రాచలం పట్టణ కేంద్రంలో నూతన సీఐ గా బాధ్యతలు స్వీకరించిన సీఐ సట్ల రాజు ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన తెలంగాణ రాష్ట్ర పెరిక కార్పొరేషన్ వైస్ చైర్మన్ బుడగం శ్రీనివాస్,సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ చింతిరాల రవికుమార్. ఈ సందర్భంగా బుడగం శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణంలో శాంతి భద్రతలపై కాని, గంజాయి డ్రగ్స్ మాదక ద్రవ్యాల పై ఉక్కు పాదం మోపాలని పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని ఆయన ఆకాంక్షించారు.

# వికసిత్ భారత్ సంకల్ప సభ సేవా జ్యోతి యాత్ర కార్యక్రమంలో పాల్గొన్న

**బిజెపి పార్టీ ముఖ్య నాయకులు**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 07 ( తొలివార్త ):** కొత్తగూడెం రైల్వే స్టేషన్ వద్ద భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప సభ -- సేవా జ్యోతి యాత్ర కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మాజీ శాసన సభ్యులు సైదిరెడ్డి జిల్లా ఇంచార్జి,విజయ చంద్ర రెడ్డి రాష్ట నాయకులు కన్నెదారి వరప్రసాద్, బిజెపి ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు పోడియం బాలరాజు, సీనియర్ నాయకులు మూసుకు శ్రీనివాస్ రెడ్డి, సేవా జ్యోతి యాత్రలో భాగంగా దేశ ప్రజలను ఉద్దేశించి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగాన్ని లైవ్ కార్యక్రమం ద్వారా వీక్షించడం జరిగింది.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగం అనంతరం సేవా జ్యోతి యాత్రకు పెద్ద ఎత్తున భారతీయ జనతా పార్టీ రాష్ట జిల్లా, నియోజకవర్గాల వారీగా, మండల నాయకులు, కార్యకర్తలు విద్యార్థులు మరియు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, నాయకులు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన

**పలువురు వ్యాపారస్తులు వివిధ పార్టీల నాయకులు**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 07 ( తొలివార్త ):** ఆళ్లపల్లి మండలంలోని పలువురు వ్యాపారస్తులు, మరియు, గౌరీశెట్టి, శ్రీనివాసరావు, వివిధ పార్టీల నాయకులు, కలిసి ఇటీవల ఆళ్లపల్లి గ్రామంలోని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ అభ్యర్థి బత్తిని సత్యం క్యాన్సర్‌తో మృతి చెందడం పట్ల గ్రామ పెద్దలు సంతాపం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మృతుని కుటుంబాన్ని పరామర్శించి, వారి కుటుంబానికి అండగా నిలుస్తూ గ్రామ పెద్ద తరపున రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు.మృతుని కుటుంబానికి సందర్శించి సత్యం.. భార్య.. కుమారుడు వెంకటేష్ కుటుంబానికి.. ఇంటికి పెద్ద దిక్కు కోల్పోవడం వారికీ తెలియజేస్తూ ధైర్యమిస్తూ, వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ప్రముఖ వ్యాపారస్థులు, పలువురు రాజకీయ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ వాసం సుష్మిత.. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు.వాసం శ్రీకాంత్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ అతహర్, ముత్తిలింగం,శ్రీరామ్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కేంద్రంలో ఈనెల 8న సేవ్ డెమోక్రసీ మార్చ్ ఫాస్ట్‌ను విజయవంతం చేయండి

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఊరు గంట రమేష్ బాబు పిలుపు**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 07 ( తొలివార్త ):** (సర్) పేరుతో ఓటర్ల హక్కులకు భంగం కలిగించే చర్యలకు వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్ర పీసీసీ నాయకత్వం జిల్లా డీసీసీ దేవి ప్రసన్న పిలుపు మేరకు, పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఆదేశాలతో, జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న "సేవ్ డెమోక్రసీ మార్చ్ ఫాస్ట్" కార్యక్రమం ఈనెల 8న కొత్తగూడెం లో ఉదయం 9-00 గంటలకు జిల్లా ఓల్డ్ బస్టాండ్ నుండి ప్రారంభమవుతుంది. అని అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు సర్పంచ్ లు ఉపసర్పంచ్ లు, మాజీ ప్రజా ప్రతినిధులు, వార్డు సభ్యులు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సంఘాల నాయకులు మరియు, విద్యార్థి విద్యార్థిని సంఘాలు ఐ ఎన్ టి యు సి, విభాగాల నాయకులు భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఓరుగంటి రమేష్ బాబు పిలుపునిచ్చారు. ఓటు అనేది ప్రతి భారతీయుని ప్రాథమిక హక్కు అని, కేంద్ర ప్రభుత్వం బీజేపీ మోసపూరిత కుట్రలతో ప్రతిపక్ష పార్టీలను తొక్కివేసే దురాలోచనలతో సర్ పేరుతో వ్యక్తుల ప్రాథమిక హక్కు ను హరించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని, ఈ కుట్రను భగ్నం చేసే అవసరం అందరిపై ఉందని, ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ, ఓటర్ల జాబితాలో పారదర్శకత కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొనాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు పిలుపునిచ్చారు.

# నాంపల్లి ప్రత్యేక కోర్టుకు హాజరైన ఎమ్మెల్యే కుంభశీ







**భువనగిరి, అక్టోబర్ 07 ( తొలివార్త ):** గతంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా నిర్వహించిన రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన కేసులో భువనగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి బుధవారం నాంపల్లి ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసుపై విచారణ పూర్తి చేసిన నాంపల్లి ప్రత్యేక కోర్టు తుది తీర్పును వెలువరించి కేసును కొట్టివేసింది. దీంతో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి కేసు నుంచి ఉపశమనం లభించింది. ఎమ్మెల్యేతో పాటు బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్, యాదాద్రి డీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాకునూరి మహేందర్, కాంగ్రెస్ యువ నాయకులు ఏడుమేకల మహేష్, ప్రదీప్ తదితరులు కోర్టుకు హాజరయ్యారు. కోర్టు తీర్పు అనంతరం నాయకులంతా కలిసి టీ తాగుతూ ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిణామాలు, భువనగిరి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలు, పార్టీ కార్యక్రమాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు.

# ఇందిరమ్మ ఇళ్లు నూతన గృహాలను ప్రారంభోత్సవం చేసిన

**ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**





**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 07 ( తొలివార్త ):** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య నగర్‌లో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో, ముఖ్యఅతిథిగా,లు గా పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే,తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు, పాల్గొని లబ్ధిదారుల కుటుంబాలను అభినందించారు. నూతన గృహాల్లోకి అడుగుపెడుతున్న కుటుంబాలతో కలిసి ఎమ్మెల్యే గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా తన్నీరు రతమ్మ, బెక్కం శ్రావణి, గనిబోయిన విజయ నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత గృహం లభించడం సంతోషకరమైన విషయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నూతన ఇంటిలో కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి భద్రత కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల ద్వారా అర్హులైన కుటుంబాలకు మేలు జరుగుతోందన్నారు. ముఖ్యంగా సొంత ఇంటి నిర్మాణం కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు.రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో గృహ నిర్మాణానికి సంబంధించిన కార్యక్రమాలను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తామని తెలిపారు.పినపాక నియోజకవర్గంలో పేదల సంక్షేమానికి, మౌలిక వసతుల అభివృద్ధికి, అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయిన వెంటనే లబ్ధిదారులు తమ కుటుంబ సభ్యులతో ఆనందంగా గృహప్రవేశం చేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని నూతన గృహాల్లో సంతోషంగా జీవించాలని లబ్ధిదారులకు ఎమ్మెల్యే సూచించారు. సుందరయ్య నగర్‌లో గృహప్రవేశం చేసుకున్న తన్నీరు రత్తమ్మ, బెక్కం శ్రావణి, గనిబోయిన విజయ కుటుంబ సభ్యులకు, ఎమ్మెల్యే ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.పేదల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో తహసిల్దార్ మున్సిపల్ కమిషనర్, హౌసింగ్ ఏఈ, సంబంధిత అధికారులు, మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్, జిల్లా ముఖ్య నాయకులు, మహిళా అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మన అంగన్వాడీ మన బాధ్యత 9వ పోషణ మాసం కార్యక్రమంలో పాల్గొన్న

**ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**





**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 07 ( తొలివార్త ):** అశ్వాపురం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం గల రైతు వేదికలో అంగన్వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ పోషణ మాసం -- "మన అంగన్వాడీ.. మన బాధ్యత" కార్యక్రమంలో పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన అంశాలపై నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని పలు అంశాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు నిర్వహించిన సామూహిక శ్రీమంత వేడుకలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని గర్భిణీలను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. తల్లి ఆరోగ్యం, బిడ్డ ఆరోగ్యం పరస్పరం ముడిపడి ఉంటాయని, గర్భధారణ సమయంలో తల్లులు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.అంగన్వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరిశీలించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన పోషక విలువలు కలిగిన వివిధ రకాల ఆహార పదార్థాలు, ఆకుకూరలు, కూరగాయలు, పప్పు ధాన్యాలను పరిశీలించి, వాటి పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాల గురించి అంగన్వాడీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, పౌష్టికాహార పదార్థాలను రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవడం ద్వారా,ఆరోగ్యాన్ని, మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. అదే కార్యక్రమంలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించి, వారికి అక్షరాలు దిద్దించారు. చిన్నారుల తొలి విద్యాభ్యాసం సంతోషంగా ప్రారంభం కావాలని ఆకాంక్షిస్తూ వారికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శుభాకాంక్షలు తెలిపారు. బాల్యంలోనే పిల్లలకు పోషకాహారంతో పాటు విద్య, మంచి అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన పోషకాహారాన్ని అందించడంలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు, చిన్నారులకు పోషణ, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ అంగన్వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రతి కుటుంబం అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.చిన్నారుల ఎదుగుదలలో తొలి దశ ఎంతో కీలకమని, ఈ సమయంలో వారికి సరైన పోషకాహారం అందించడంతో పాటు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. పిల్లల ఆరోగ్యం, ఎదుగుదలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని, అవసరమైన సూచనలు అందించడంలో అంగన్వాడీ సిబ్బంది మరింత చురుకైన పాత్ర పోషించాలని అన్నారు."మన అంగన్వాడీ.. మన బాధ్యత" అనే నినాదం ప్రతి కుటుంబానికి చేరేలా పోషణ మాసం కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వ శాఖలు, అంగన్వాడీ సిబ్బంది, ప్రజలు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్యకరమైన తరం నిర్మాణానికి పోషకాహారం ఎంతో ముఖ్యమని తెలిపారు.పేద,మధ్యతరగతి కుటుంబాలకు చెందిన గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అందుతున్న పోషకాహారం, ఆరోగ్య సేవలు సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు అందేలా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తామని తెలిపారు.పినపాక నియోజకవర్గంలో మహిళలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణతో పాటు వారి విద్యాభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు, పిల్లలకు అనుకూలమైన వాతావరణం, గర్భిణీలు మరియు బాలింతలకు అవసరమైన సేవలు అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటామని చెప్పారు.మహిళలు, చిన్నారుల ఆరోగ్యం విషయంలో ప్రతి కుటుంబం బాధ్యతగా వ్యవహరించాలని, అంగన్వాడీ సిబ్బంది అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు. ఆరోగ్యవంతమైన తల్లి, ఆరోగ్యవంతమైన బిడ్డ, విద్యావంతమైన భవిష్యత్ తరాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో ముత్యాలరావు తాహసిల్దార్ సూర్యప్రకాష్, మరియు అంగన్వాడీ, ఐసిడిఎస్ సిడిపిఓ మంగతార, అంగన్వాడి,సిబ్బంది, సూపర్వైజర్ లు, సంబంధిత శాఖల అధికారులు,సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఓరుగంటి రమేష్ బాబు,, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఆవుల రవి బెల్లం వీరభద్రం గొల్లపల్లి నరేష్, మరియు గ్రామ పంచాయతీల,సర్పంచులు,ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, మాజి ప్రజా ప్రతినిధులు,గర్భిణీ స్త్రీలు మహిళలు,స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కోయ గోండు భాషా ప్రమాణీకరణకు జాతీయ స్థాయి వర్క్‌షాప్ లో పాల్గొన్న

**పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య,ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పి వో రాహుల్**



**భద్రాద్రి జిల్లా అక్టోబర్ 07 ( తొలివార్త ):** భద్రాచలంలో గిరిజన సంక్షేమ శాఖ, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఆధ్వర్యంలో కోయ,గోండు,భాష ప్రమాణీకరణ,నిఘంటువు రూపకల్పనపై,12వ జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఐటీడీఏ పీవో బి. రాహుల్ భద్రాచలం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.ఈ వర్క్‌షాప్‌లో కోయ, గోండు భాషకు సంబంధించిన పదాలను




సేకరించడం,వాటి మూలాలను గుర్తించడం, భాషను శాస్త్రీయ,పద్ధతిలో,ప్రమాణీకరించడం,కోయ భాషా నిఘంటువును రూపొందించడం వంటి అంశాలపై భాషా నిపుణులు, పరిశోధకులు, గిరిజన ప్రతినిధులు, కలిసి విస్తృతంగా చర్చించారు.ఆదివాసీ గిరిజనుల భాష, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కోయ భాషను మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావడంతో పాటు విద్యా రంగంలోనూ విస్తృతంగా వినియోగించేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సూచించారు.కోయ భాషా పదసంపదను శాస్త్రీయ పద్ధతిలో నమోదు చేసి, నిఘంటువు రూపంలో అందుబాటులోకి తీసుకురావడం ద్వారా గిరిజన భాషా వారసత్వాన్ని పరిరక్షించేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని తెలిపారు.అనంతరం భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఐటీడీఏ పీవో బి. రాహుల్ ని నిర్వాహకులు శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ఐటీడీఏ, ఏ పీ ఓ డేవిడ్ రాజ్, సంబంధిత శాఖ ఐటీడీఏ అధికారులు, కోయ గుండు భాషా నిపుణులు, పరిశోధకులు, గిరిజన ప్రతినిధులు తదితరులు, ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు ఆదివాసి జేఏసీ సంఘాల నాయకులు యువకులు మహిళా సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానోపాధ్యాయులు పాఠశాల కు నాయకత్వం వహించాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి.**





**యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 07 ( తొలివార్త ):జిల్లా ప్రతినిధి** జిల్లాలోని విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు ప్రధాన పాత్ర పోషించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయుల ఒక రోజు సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎఫ్.ఎల్.ఎన్.లో ప్రగతి సాధించడానికి ప్రతి పాఠశాలలో వారానికి ఒక గంట సేపు రీడింగ్ అవర్ కార్యక్రమాన్ని ప్రారంభించాలని జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు.మండలాలు మరియు కాంప్లెక్స్ ల వారీగా సమీక్ష చేసి, వివిధ విషయాలలో వెనుకబడి ఉన్న ప్రధానోపాధ్యాయులను కారణాలు అడిగి తెలుసుకుని, తిరిగి జరిపే సమీక్షా సమావేశంలో ప్రగతి మెరుగు చూపించాలని ఆదేశించారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరులో,ఇతర విద్యా విషయాల్లో జిల్లాను ఉన్నత స్థానంలో ఉండేలా కృషి చేయాలని కోరారు. జిల్లా విద్యాశాఖాధికారి భిక్షపతి మాట్లాడుతూ ఎఫ్.ఎల్.ఎన్, ఎ.ఎక్స్.ఎల్, మధ్యాహ్న భోజనం,నోటు పుస్తకాలు,పాఠ్య పుస్తకాలు, వర్క్ పుస్తకాలు,ప్రతిభా గ్రేడ్ ఇండెక్స్,అకాడమిక్ ప్యానెల్ ఇన్స్పెక్షన్,పూర్వ ప్రాథమిక విద్య,ఎఫ్.ఆర్.ఎస్,ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా, యు.డైస్ డ్రాప్ బాక్స్ ,ఆధార్,అపార్,టాయిలెట్స్, విద్యుత్తు,త్రాగు నీరు,సమగ్ర శిక్ష,పి.ఎం.శ్రీ సివిల్ పనులు మరియు నిధుల ఖర్చు,ఏకరూప దుస్తులు, బూట్లు,బెల్టులు,ఎస్.హెచ్.వి.ఆర్,ప్రశస్త మరియు ఓపెన్ స్కూల్ లో ప్రవేశాలు,పదవ తరగతి పరీక్షల ప్రణాళిక మొదలైన అంశాల మీద సమగ్ర సమీక్ష జరిపారు.ఈ సమావేశంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సీ.హెచ్.శ్రీనివాస్, జిల్లా కామన్ పరీక్షల బోర్డు అధికారి పాండు, ప్రభుత్వ పరీక్షల విభాగం అదనపు కార్యదర్శి శ్రీనివాస్, సెక్టోరియల్ అధికారులు అందాలు,శ్రీహరి అయ్యంగార్, పెసరు లింగారెడ్డి,జానీ ఆఫ్ఘన్, ఎం.నరహరి,జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్,స్పోర్ట్స్ అధికారి కే.కే.శ్రీధర్,పాఠ్య పుస్తకాల సహ శాఖాధికారి బి.రమేష్, ఎఫ్.ఎల్.ఎన్.రాష్ట్ర బాధ్యులు కావ్య, చందన,మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు,మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్ళు,కేజీబీవీ ఎస్.ఓ.లు తదితరులు పాల్గొన్నారు.

తొలివార్త
తెలుగు దిన పత్రిక
RNI : TGTEL/25/A0357
గురువారం 08 - 10 - 2026

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి రూ.15 వేల జరిమానా

**వారం రోజుల పాటు కమ్యూనిటీ సర్వీస్ చేయాలని మెజిస్ట్రేట్ తీర్పు**



**భువనగిరి, అక్టోబర్ 07 ( తొలివార్త ):** యాదాద్రి భువనగిరి జిల్లా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఇద్దరు వ్యక్తులకు భువనగిరి పట్టణ పోలీసుల డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో గౌరవ స్పెషల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జరిమానాతో పాటు కమ్యూనిటీ సర్వీస్ చేయాలని తీర్పు వెలువరించారు. భువనగిరి పట్టణ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. వారిలో బోనగిరికి చెందిన జూలూరు రాహుల్ (25), సత్యనారాయణ కుమారుడు, అలాగే భువనగిరికి చెందిన బీరకాయల అజయ్ (24), రామ నరసయ్య కుమారుడు ఉన్నారు. ఈ ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా, విచారణ అనంతరం గౌరవ స్పెషల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఒక్కొక్కరికి జరిమానా విధించడంతో పాటు సత్ప్రవర్తనలో భాగంగా వారం రోజుల పాటు కమ్యూనిటీ సర్వీస్ చేయాలని ఆదేశించారు. మొత్తం రూ.15,000 జరిమానా విధించినట్లు భువనగిరి పట్టణ పోలీసులు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల ముప్పు పెరగడంతో పాటు వాహనదారులు, ఇతర ప్రయాణికుల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడిపే వారిపై ఇకపై కూడా నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. భువనగిరి పట్టణ ప్రజలు, వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపకుండా బాధ్యతగా వ్యవహరించాలని భువనగిరి పట్టణ పోలీసులు విజ్ఞప్తి చేశారు. రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఇట్లు భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి సీఐ ఎం. రవి



**వలిగొండ అక్టోబర్ 07 ( తొలివార్త ):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ నేటి డిజిటల్ యుగంలో రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. రవి సూచించారు. బుధవారం పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ ఎం. రవి మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దని సూచించారు. బ్యాంకు అధికారులమంటూ ఫోన్ చేసి ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం లేదా ఇతర వ్యక్తిగత సమాచారాన్ని అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని తెలిపారు. ఆన్‌లైన్‌లో నగదు బదిలీ చేసే ముందు వివరాలను ఒకటికి రెండుసార్లు పరిశీలించుకోవాలని, ఉచిత బహుమతులు, లాటరీలు తగిలాయని వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎం. శ్రీకాంత్ రెడ్డి, పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యావంతులు పట్టభద్రుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసింది రాపోలు నవీన్ కుమార్



**సూర్యాపేట( నేరేడుచర్ల) అక్టోబర్ 07 ( తొలివార్త ):** నేరేడుచర్ల లో పట్టభద్రుల ఓటర్ నమోదు ప్రక్రియ పై అవగాహన కల్పించడంలో భాగంగా గ్రాడ్యుయేట్స్ ను కలిసి ఫాం 18 అందజేసిన బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రాపోలు నవీన్ కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యం ప్రతీ పట్టభద్రుడు ఓటరుగా నమోదు అవ్వాలని పిలుపునిచ్చారు. నేరేడుచర్ల లో పోలీస్ మరియు కంపిటేటివ్ ఉద్యోగాల పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులను కలసి గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి చెందినప్పటికీ బీఆర్ఎస్ పార్టీ ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యావంతులు పట్టభద్రుడు సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసిందని సాధారణ ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికలు భిన్నమైనదని, సమాజానికి మార్గదర్శకంగా నిలిచే పట్టబద్రులు వేసే ఓటు కాబట్టి ప్రతి పట్టభద్రుడు తమ విలువైన ఓటును నమోదు చేసుకోవాలి అని వారిని కోరారు ఈ కార్యక్రమం లో యువజన విభాగం నాయకులు పెరుమాళ్ళ సతీష్ కుమార్ అరే శ్రీకాంత్ పత్తిపాటి రమేష్ బోస్ సంధ్య గీత నిరుద్యోగ యువతి యువకులు పాల్గొన్నారు

## పట్టభద్రులందరూ ఓటరుగా నమోదుచేసుకోవాలి..

**జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య..**





**నూతనకల్, అక్టోబర్ 07 ( తొలివార్త ):** అర్హత గల పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపాటి నరసయ్య కోరారు.బుధవారం మండల కేంద్రములో పట్టభద్రుల ఓటరూ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ నవంబర్ 2023 లోపు ఉత్తీర్ణులై డిగ్రీ,డిప్లొమా, గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఓటు హక్కు నమోదు చేసుకొని నల్లగొండ ఖమ్మం వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి మద్దతు తెలిపి,అఖండ మెజారిటీతో గెలిపించాలనీ కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు,మాజీ మండల పార్టీ అద్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ అద్యక్షులు పసుల అశోక్ యాదవ్,గ్రామ శాఖ అద్యక్షులు బొడ్డుపల్లి అంజయ్య,జిల్లా కాంగ్రెస్ నాయకులు నకిరకంటి వెంకన్న,జహంగీర్,సోషల్ మీడియా కోఆర్డినేటర్ బొల్క సైదులు యాదవ్,మండల కాంగ్రెస్ నాయకులు ఏనుగుతుల సోమయ్య,కందుకూరి శ్రీకాంత్, మడ్డి లింగయ్య,బాణాల కిరణ్ రెడ్డి,సామ ఉపెందర్ రెడ్డి,లతీఫ్,బొల్లేద్దు నాగయ్య, దేవరకొండ సాయి, భాను,కారింగుల రవి తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం..

**సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్..**





**నూతనకల్, అక్టోబర్ 07 ( తొలివార్త ):** పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సాయిరాం ఫంక్షన్ హాల్ లో 2026 పోషణ్ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ హాజరై మాట్లాడారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పోషకాహారం ఎంతో కీలకమని అన్నారు.చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అవసరమైన పోషకాహారం అందించడంలో కుటుంబ సభ్యులతో పాటు సమాజం కూడా బాధ్యత తీసుకోవాలని సూచించారు.అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం, ఆరోగ్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అంగన్వాడీలో పోషణ్ మాసం ద్వారా పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, చిన్నారుల ఎదుగుదల, గర్భిణీలు, బాలింతల ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.పోషకాహార లోపాన్ని నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల స్థాయిలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చిరుధాన్యాలు, పప్పులు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తదితర పోషక విలువలు కలిగిన పదార్థాలతో తయారు చేసిన పౌష్టికాహార వంటకాలను ప్రదర్శించారు. స్థానికంగా సులభంగా లభించే ఆహార పదార్థాలతో ఆరోగ్యకరమైన వంటకాలను తయారు చేసుకునే విధానాలను వివరించారు.అదేవిధంగా తల్లులు--పిల్లల పోషణ, గర్భిణీలు, బాలింతల ఆహారపు అలవాట్లు, పిల్లల శారీరక--మానసిక అభివృద్ధి, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు.అనంతరం సామూహిక శ్రీమంతాలు, అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలను అతిథుల చేతుల మీదుగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిడిపిఓ శ్రీజ, ఎంపీడీవో సునీత, సూపర్వైజర్ పద్మ,నాగిత, సునీత,మహిళ సాధికారత కేంద్రం డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ చైతన్య, బ్లాక్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి,అంగన్‌వాడీ టీచర్లు,ఆయాలు,ఆశా కార్యకర్తలు,ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

# మునుగోడు నియోజకవర్గ ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలి..

**హామీలు కాదు..అభివృద్ధి పనులు కావాలి...!**

**తాగునీరు,రోడ్లు,డ్రైనేజీ,సాగునీరు,రైతులు, ఉపాధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**



**మునుగోడు, అక్టోబర్ 07 ( తొలివార్త ):** మునుగోడు నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ప్రభుత్వం,ప్రజాప్రతినిధులు,అధికారులు తక్షణమే పరిష్కరించాలని బీసీవై పార్టీ తెలంగాణ పిఏసి సభ్యులు,భారత మానవ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.చిలకల శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు.ప్రజలకు ప్రతిరోజూ అవసరమైన తాగునీరు,మంచి రహదారులు,డ్రైనేజీ, పారిశుధ్యం,సాగునీరు, విద్య,వైద్యం,ఉపాధి వంటి మౌలిక సదుపాయాలు సక్రమంగా అందేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు.

**తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం**

నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో తాగునీటి సరఫరాను అధికారులు సమీక్షించాలని డా.శ్రీనివాస్ యాదవ్ కోరారు.నీటి సరఫరాలో అంతరాయం ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే పరిష్కరించడంతో పాటు, పైప్‌లైన్లు,ట్యాంకులు,నీటి వనరుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.ప్రతి కుటుంబానికి సురక్షితమైన తాగునీరు అందడం ప్రజల ప్రాథమిక హక్కు.నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి ఉండకూడదని అన్నారు.

**డ్రైనేజీ-పారిశుద్ధ్యంపై అత్యవసర చర్యలు**

నియోజకవర్గం లోని మున్సిపాలిటీలు మరియు గ్రామపంచాయతీలలో మురుగునీరు రోడ్లపై నిలిచే ప్రాంతాలను గుర్తించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరారు.చెత్త తొలగింపు,కాలువల శుభ్రత,దోమల నివారణ వంటి పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని అన్నారు.ప్రజల ఆరోగ్యానికి ఇబ్బందులు కలగకుండా స్థానిక సంస్థలు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టాలని డిమాండ్ చేశారు.

**రోడ్ల పరిస్థితిని మెరుగుపరచాలి**

మునుగోడు నియోజకవర్గంలోని దెబ్బతిన్న రోడ్లను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.గ్రామీణ ప్రాంతాల అంతర్గత రోడ్లు,ప్రధాన రహదారులు,పాఠశాలలు, ఆసుపత్రులకు వెళ్లే రోడ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు.రోడ్లు ప్రజల ప్రయాణానికి మాత్రమే కాకుండా రైతులు తమ పంటను మార్కెట్‌కు తీసుకెళ్లడానికి,విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడానికి,అత్యవసర వైద్య సేవలు పొందడానికి కీలకమని తెలిపారు.

**సాగునీరు రైతులకు అత్యంత ముఖ్యమైన సమస్య**

మునుగోడు ప్రాంత రైతులకు సాగునీరు అందేలా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని కోరారు.చెరువులు, కుంటలు,కాలువల అభివృద్ధి,పూడికతీత పనులను చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని అన్నారు.రైతుకు నీరు అందితేనే వ్యవసాయం బలపడుతుంది.వ్యవసాయం బలపడితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని పేర్కొన్నారు.

**యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి**

మునుగోడు నియోజకవర్గ యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు.యువతకు స్కిల్ డెవలప్‌మెంట్,కంప్యూటర్ శిక్షణ,వృత్తి విద్య,స్వయం ఉపాధి శిక్షణ అందించే కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.స్థానిక పరిశ్రమలల్లో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని అన్నారు.

**విద్య-వైద్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి**

ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు,మరుగుదొడ్లువిద్యుత్,తరగతి గదులు,డిజిటల్ విద్య వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని కోరారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన వైద్య సిబ్బంది,మందులు, పరీక్షా సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.అదేవిధంగా చౌటుప్పల్ మున్సిపాలిటీలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ఆసుపత్రిని త్వరగా పూర్తి చేసి,పేద ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు.

**ప్రజల సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి**

అధికారులు కార్యాలయాల్లో కూర్చొని ఫిర్యాదులు స్వీకరించడం మాత్రమే కాకుండా,గ్రామాల్లో పర్యటించి ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలను గుర్తించాలని డా.శ్రీనివాస్ యాదవ్ కోరారు.ప్రతి మండలంలో ప్రజా సమస్యల జాబితాను తయారు చేసి,అత్యవసర సమస్యలకు తక్షణ పరిష్కారం,దీర్ఘకాలిక సమస్యలకు గడువుతో కూడిన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

**ప్రభుత్వానికి ప్రధాన డిమాండ్లు**

1. ప్రతి గ్రామంలో తాగునీటి సమస్యపై ప్రత్యేక సర్వే నిర్వహించాలి. 2. డ్రైనేజీ,పారిశుధ్య సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలి. 3. దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. 4. సాగునీటి పనులు, చెరువులు,కాలువల అభివృద్ధిని వేగవంతం చేయాలి. 5. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. 6. యువతకు స్కిల్ డెవలప్‌మెంట్,స్థానిక ఉపాధి అవకాశాలు పెంచాలి. 7. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలి. 8. ప్రతి మండలంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను బలోపేతం చేయాలి.

**ప్రజలకు హామీలు కాదు -కనిపించే అభివృద్ధి కావాలి**

ప్రజా సమస్యలను రాజకీయ భేదాలకు అతీతంగా పరిష్కరించాలని,ప్రతి పౌరుడికి సమానంగా ప్రభుత్వ సేవలు అందాలని డా.చిలకల శ్రీనివాస్ యాదవ్ అన్నారు.తాను బీసీవై పార్టీ తెలంగాణ పిఏసి సభ్యుడిగా,భారత మానవ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి,పరిష్కారం కోసం నిరంతరం ప్రజలతో కలిసి పనిచేస్తానని తెలిపారు.మునుగోడు నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కారమయ్యే వరకు ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటాం.ప్రజల హక్కులు,అభివృద్ధి,సంక్షేమం కోసం నిరంతరం ముందుకు సాగుతామని డా.చిలకల శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.

# విద్యుత్ వినియోగదారులకు నిరంతరం అందుబాటులో గ్రీవెన్స్ రెడ్రెసల్ ఫోరం

**ఫిర్యాదులను వ్రాతపూర్వకంగా, ఆన్‌లైన్‌లో సమర్పించి సమస్యలను పరిష్కరించుకోవాలిసీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ కే. సాయిబాబా**



**భువనగిరి, అక్టోబర్ 07 ( తొలివార్త ):** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఎలక్ట్రిసిటీ కంజ్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెసల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) నిరంతరం అందుబాటులో ఉంటుందని సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ కే. సాయిబాబా తెలిపారు. వినియోగదారులు తమ సమస్యలను వాతపూర్వకంగా లేదా ఆన్‌లైన్ ద్వారా ఫోరానికి ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని భువనగిరి కిసాన్ నగర్‌లో గల విద్యుత్ కార్యాలయంలో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కే. సాయిబాబా మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, వోల్టేజీ హెచ్చుతగ్గులు, విద్యుత్ మీటర్ల సమస్యలు,



విద్యుత్ బిల్లులకు సంబంధించిన సమస్యలు, కొత్త విద్యుత్ సర్వీసుల మంజూరు, మీటర్ పేరుమార్పు, కేటగిరీ మార్పు, ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన సమస్యలు తదితర అంశాలపై వినియోగదారులు ఫోరంలో ఫిర్యాదు చేసుకోవచ్చని తెలిపారు. వినియోగదారులు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో సీజీఆర్ఎఫ్‌ను ఆశ్రయించి న్యాయం పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులకు అందుబాటులో ఉండేలా ఫోరం పనిచేస్తోందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి వినియోగదారుల సంఘాల ప్రతినిధి కొడారి వెంకటేష్ జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను విద్యుత్ శాఖ అధికారులు సత్వరమే పరిష్కరించాలని వినియోగదారుల సంఘాల ప్రతినిధి కొడారి వెంకటేష్ డిమాండ్ చేశారు. విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికలో ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా విద్యుత్ తీగల కింద మొక్కలు నాటకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ తీగలకు సమీపంలో పెరిగే చెట్లు, కొమ్మల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో నెలకొంటున్న లోవోల్టేజీ సమస్యను పరిష్కరించడం, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ కంచెలు ఏర్పాటు చేయడం, రైతులకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడం, అర్హులైన ప్రతి కుటుంబానికి గృహజ్యోతి పథకం ప్రయోజనం అందేలా చూడడం వంటి సమస్యలను అధికారులు ప్రాధాన్యతతో పరిష్కరించాలని కోరారు. అనంతరం వినియోగదారుల సమస్యలపై సీజీఆర్ఎఫ్ సభ్యులకు కొడారి వెంకటేష్ వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రిసిటీ కంజ్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెసల్ ఫోరం మెంబర్ టెక్నికల్ వి. రమణమూర్తి, మెంబర్ ఫైనాన్స్ కే. శోభారాణి, కంజ్యూమర్ ఎఫైర్స్ మెంబర్ టి. కోటేశ్వరరావు, భువనగిరి, రామన్నపేట, బీబీనగర్, మోత్కూరు, ఆలేరు, చౌటుప్పల్ డివిజన్లకు చెందిన ఇంజనీర్లు రవీందర్, వెంకటేశ్వర్లు, సుధీర్ కుమార్, పద్మ, శ్రీకాంత్, బాలూ నాయక్, ఫీర్యా, మోహన్, పట్టణ ఏఈ సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీలో చారిత్రాత్మక విజయం సాధించనున్న ఐక్య కూటమి

**సమస్యలపై బాణం ఎక్కుపెడదాం.**

**నక్షత్రం వెలుగులో ఐక్యంగా ఉందాం.**

**బాణం నక్షత్రం గుర్తుకే మన ఓటు.**

**తెలంగాణ మోడల్ విలీనం సంపూర్ణ ఉద్యోగ భద్రత 20 25 వేతన సవరణ సాధిద్దాం.**

**ఖమ్మం ఆర్టీసీ మహిళా సదస్సులో ఐక్య కూటమినేతలు.**






**ఖమ్మం అక్టోబర్ 07 ( తొలివార్త ):** తెలంగాణ ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీఎంయూ అశ్వధామ రెడ్డి ఐ ఎన్ టి యు సి బలపరిచిన తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ టి డబ్ల్యూ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్ డబ్ల్యూ ఎఫ్ ) ఐక్య కూటమి అఖండ మెజారిటీతో చారిత్రాత్మక విజయం సాధించనున్నదని ఐక్య కూటమినేతలు గడ్డం లింగమూర్తి అర్వినేని కృష్ణ బత్తినేని హనుమంతరావు పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం ఖమ్మం లోని మంచి కంటి మీటింగ్ హాల్లో డి సరిత కే మాధవి ల అధ్యక్షతన ఆర్టీసీ ఆత్మీయ మహిళా సదస్సు జరిగింది. సదస్సులో ముఖ్య అతిథులుగా పాల్గొన్న తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం టీపీఎస్కే జిల్లా కన్వీనర్ 6 పల్లి ఝాన్సీ, ఖమ్మం అర్బన్ జిల్లా అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి మాట్లాడుతూ గత పది సంవత్సరాల కాలంలో ఆర్టీసీ కార్మికులు అనేక హక్కులు సౌకర్యాలు కోల్పోయారని ఇబ్బందులు ఆంక్షలు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. అందువల్ల ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల సానుకూలంగా ఉన్న ప్రజా ప్రభుత్వం మద్దతుతో సమస్యలు పరిష్కరించుకొని సంపూర్ణ ఉద్యోగ భద్రత సాధించాలని అందుకని ఐక్య కూటమి విజయంతో అందరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఐక్య కూటమి ఖమ్మం రీజనల్ చైర్మన్ గడ్డం లింగమూర్తి ఐఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బత్తినేని హనుమంతరావు టీఎంయూ రీజనల్ కార్యదర్శి అర్వినేని కృష్ణాలు ప్రసంగిస్తూ సుదీర్ఘకాలం ఆర్టీసీలో గుర్తింపు సంఘాలుగా కొనసాగిన ఎంప్లాయిస్ యూనియన్ నేషనల్ మజ్దూర్ యూనియన్లు ఆర్టీసీ కార్మికులకు భద్రత సాధించలేకపోయారని, బద్ధ శత్రువులుగా కొనసాగిన సంఘాలు నేడు మహాకోటమి అంటూ ఆర్టిసి కార్మికులను మోసగించటానికి వస్తున్నాయని విమర్శించారు. దశాబ్దాల పాటు సాధించలేని ఉద్యోగ భద్రత ఇప్పుడు ఎలా సాధిస్తారని వారు ప్రశ్నించారు. తెలంగాణ మోడల్ విలీనం సంపూర్ణ ఉద్యోగ భద్రత 20 25 వేతన సవరణ పించిన పనిభారాలు తగ్గింపు కోసం ఎన్నికల అనంతరం కూడా పోరాడుతుందని అన్నారు. ఐక్య కూటమిని అఖండ మెజారిటీతో గెలిపించాలని వారు పిలుపునిచ్చారు. ఎస్డబ్ల్యుఎఫ్ రాష్ట్ర మహిళా కన్వీనర్ జే పద్మావతి మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల విలీనం సంపూర్ణ ఉద్యోగ భద్రత పట్ల సమగ్రమైన అవగాహన కలిగిన స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ యుక్తి వేలాది మంది ఆర్టీసీ కార్మికుల అభిమానం కలిగిన అశ్వధామ రెడ్డి శక్తి ల కలయికతో ఆర్టీసీ కార్మికులకు మేలు జరుగుతుందని తెలిపారు.

**లాల్ బి ఎంప్లాయిస్ యూనియన్ నుండి ఎస్ డబ్ల్యూ ఎఫ్ లో చేరిక.**

గుర్తింపు ఎన్నికల్లో జరగనున్న నేపథ్యంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ ఐక్య కూటమి విజయాన్ని కాంక్షిస్తూ ఖమ్మం డిపో ఎంప్లాయిస్ యూనియన్ సీనియర్ సభ్యురాలు షేక్ లాల్బి బుధవారం జరిగిన సదస్సు సందర్భంగా ఎస్ డబ్ల్యూ ఎఫ్ లో చేరారు. ఆమెకు ఎస్ డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పద్మావతి యూనియన్ కండువా కప్పి సాదరంగా యూనియన్ లోనికి ఆహ్వానించారు లాల్బీని ఐక్య కూటమి నేతలు సభ్యులు అభినందించారు. ఖమ్మం డిపో మహిళా ఉద్యోగుల ఆత్మీయ కలయికతో జరిగిన మహిళా సదస్సులో టిఎంయూ రీజనల్ కార్యదర్శి అర్విసేని కృష్ణ ఎస్ డబ్ల్యూ ఎఫ్ రీజనల్ కార్యదర్శి పిట్టల సుధాకర్ ఎస్ డబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి బత్తినేని హనుమంతరావు ఐక్య కూటమి రీజనల్ కన్వీనర్ గుర్రం శ్రీనివాసరావు మహిళా నేతలు నాగవీణ కీత పద్మ సిహెచ్ విజయలక్ష్మి కే సంధ్యారాణి ఐక్య కూటమి నాయకులు గుర్రం ఉప్పలయ్య గుండు మాధవరావు, తేల్లూరి యాదగిరి మెరుగు రవీంద్రనాథ్ గుగ్గిల రోశయ్య గడ్డం వెంకటయ్య చేకూరి రామకృష్ణ ఆర్కే నాయుడు జ్యోతి భాగ్యలక్ష్మి యమునా రేణుక విజయలక్ష్మి ఉమారాణి ఉషారాణి లక్ష్మీరమ మల్లికాంబ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్‌లో పట్టభద్రుల ఓటర్ నమోదు కార్యక్రమం ప్రారంభం





**చౌటుప్పల్, అక్టోబర్ 07 ( తొలివార్త ):** వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటర్ నమోదు కార్యక్రమాన్ని బుధవారం చౌటుప్పల్‌లో ప్రారంభించారు.ఉమ్మడి నల్గొండ జిల్లా జనసేన పార్టీ నాయకులు ఆముదాల పరమేశ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభమైంది.ఈ సందర్భంగా ఆముదాల పరమేశ్ మాట్లాడుతూ..పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతి పట్టభద్రుడు తమ ఓటర్ నమోదును సక్రమంగా పూర్తి చేసుకోవడం ముఖ్యమని అన్నారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కు, ఓటర్ నమోదు ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ఆయన వివరంగా మాట్లాడారు.వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జనసేన పార్టీ అభ్యర్థి గడల శ్రీనివాసరావు కోసం జనసేన పార్టీ నాయకులు,జన సైనికులు నిరంతరం ప్రజల్లోకి వెళ్తూ ఓటర్ నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్‌గా నమోదు చేసుకోవడానికి అర్హత ఉన్న వారు తమను సంప్రదిస్తే ఉచితంగా ఓటర్ నమోదు ప్రక్రియలో సహాయం అందిస్తామని ఆముదాల పరమేశ్ తెలిపారు.అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఓటర్ నమోదును పూర్తి చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గం కో-ఆర్డినేటర్ కూనపురెడ్డి శివ కార్తీక్,మునుగోడు నియోజకవర్గం పిఓసి పీక ప్రవీణ్,పల్చం శ్రీకాంత్,సరికొండ సంజయ్,నిఖిల్, రమణబాబు,రాజు,గణేశ్, నజీర్,సాయి,తదితర జన సైనికులు పాల్గొన్నారు.

## షేక్ ఫరీద్ కుటుంబానికి పీజీఆర్ ఆర్థిక భరోసా

**బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేత**



**గుర్రంపోడు అక్టోబర్ 07 ( తొలివార్త ):** గుర్రంపోడు మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో నివాసముంటూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన షేక్ ఫరీద్ కుటుంబాన్ని బుధవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్‌రెడ్డి (పీజీఆర్) పరామర్శించారు. ఫరీద్ మృతికి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబ ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆర్థిక సాయం అందజేసి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వేముల యాదయ్య, షేక్ కాసిం, వినయ్, జానీ పాషా, పవన్, వేముల సరస్వతి, మహమ్మద్ అబ్బాస్, వేముల లక్ష్మమ్మ, ఇటికాల లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## టీవీఎస్ కొత్త మోడల్ ద్విచక్ర వాహనాలను లాంచింగ్ చేసిన డిఎస్పి మధుసూదన్ రెడ్డి





**చౌటుప్పల్, అక్టోబర్ 07 ( తొలివార్త ):** చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో టీవీఎస్ సాయిస్ఫూర్తి మోటార్స్ లో 113జూపిటర్ డిటిఎస్ ఎక్స్ సి కొత్త మోడల్ లాంచింగ్ విజయవంతంగా జరిగింది.ముఖ్య అతిథులుగా చౌటుప్పల్ డిఎస్పి మధుసూదన్ రెడ్డి సిఐ మన్మధ కుమార్,ట్రాఫిక్ సిఐ నందగిరి వెంకటేష్,టీవీఎస్ మోటార్ కంపెనీ ప్రతినిధి ప్రశాంత్ రెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్,14వ వార్డు కౌన్సిలర్ ఉడుగు జ్యోతి రమేష్ గౌడ్,19 వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్, ఉష్కాగుల నాగరాజు,చెరుకు లింగస్వామి,షోరూం యజమాన్యం పాల్గొన్నారు.ఈ సందర్భంగా షోరూం యజమానులు మాట్లాడుతూ సాయిస్ఫూర్తి షోరూం పై మీరు చూపించే విశ్వాసం మరువ లేమని కొనియాడారు. అదేవిధంగా ఇప్పుడు కొత్త వెహికల్ దసరా,దీపావళి పండుగల సందర్భంగా అద్భుతమైన డిస్కౌంట్ లో మీ ముందుకు రావడం జరిగిందన్నారు.ఈ సువర్ణ అవకాశాన్ని చౌటుప్పల్ పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోగలరని కోరారు.

**షో రూం ఆఫర్స్**

దసరా, దీపావళి పండుగల ఆఫర్స్ రూ.1000 నుండి 10వేల వరకు వరకు డిస్కంట్ ను సద్వినియోగం చేసుకోగలరని అన్నారు.వాహనాన్ని బుక్ చేసుకోవాల్సిన వారు ఈ కింది నెంబర్లను 8143732248-9676333248సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమాన్ని షోరూం యాజమాన్యం,సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారు.

## సిపిఎం పార్టీ సీనియర్ నాయకుడు కనగంటి తిరపయ్యను పరామర్శించిన భూక్య వీరభద్రం.



**రఘునాధపాలెం అక్టోబర్ 07 ( తొలివార్త ):** గణేశ్వరం గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు కామ్రేడ్ కనగంటి తిరపయ్యను పరామర్శించిన సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం. కనగంటి తిరపయ్య ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి రావడం జరిగింది. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారు త్వరగా కోలుకోవాలని జన స్రవంతిలో కలిసి ప్రజలతో మమేకమై సమాజ సేవలో పాల్గొనాలని వారు కోరారు. వారి కుమారుడు కనగంటి వెంకన్నను వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు సిపిఎం పార్టీ కొనిజర్ల మండల నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు గణేశ్వరం ఉప సర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్ఐఐసీ కాలనీలో ఘనంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 07 ( తొలివార్త ):ప్రతి నిధి.** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరారం డివిజన్: సూరారం డివిజన్ పరిధిలోని టీఎస్ఐఐసీ కాలనీలో మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ మరియు డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన, ఎన్రోల్మెంట్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద హాజరై, అర్హులైన పట్టభద్రులు తప్పనిసరిగా ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచిస్తూ కార్యక్రమానికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టభద్రులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ తప్పనిసరిగా ఫారం--18 ద్వారా తమ పేరును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో పట్టభద్రుల ఓటు ఎంతో కీలకమని, ప్రతి అర్హుడికి ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సిద్ధిక్, మహిళా అధ్యక్షురాలు హేమ లతా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి గారు బసిరుద్దీన్ , ఫిరోజ్ చెక్క సురేష్ దొడ్ల శ్రీనివాస్ , లక్ష్మీనారాయణ , సురేష్ చంద్రశేఖర్ రెడ్డి సుధాకర్ రెడ్డి సాయిబాబా రోషన్ లావణ్య షైనాజ్ బేగం నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు మరియు కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కంచరకుంట్ల కాలనీ కమ్యూనిటీ స్థలాన్ని కాపాడాలి..!

**కాలనీ వాసుల నిరసన**



**చౌటుప్పల్, అక్టోబర్ 07 ( తొలివార్త ):** చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని 12వ వార్డు లోని కంచరకుంట్ల కాలనీకి సంబంధించిన కమ్యూనిటీ స్థలాన్ని కబ్జా ప్రయత్నాల నుంచి కాపాడాలని డిమాండ్ చేస్తూ కాలనీ వాసులుబుధవారం ఆందోళన వ్యక్తం చేశారు.చౌటుప్పల్ మున్సిపాలిటీ 12వ వార్డులోని కంచరకుంట్ల కాలనీలో సుమారు 800 గజాల స్థలం కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించారని కాలనీ వాసులు తెలిపారు.కాలనీ అధ్యక్షుడు కోనేటి నరసింహ మాట్లాడుతూ.. 2003లో 30 ప్లాట్లతో ఏర్పాటైన వెంకట్ రెడ్డి వెంచర్‌కు 2025లో 31,32,33,34 నంబర్లతో కొత్త ప్లాట్లను జత చేసిన లేఅవుట్ ఎస్ఆర్ఓ కి సమర్పించి,సుమారు 800 గజాల స్థలానికి డాక్యుమెంట్స్ సృష్టించారని ఆరోపించారు.అసలు వెంచర్‌కు సుమారు 150 నుంచి 200 మీటర్ల దూరంలో ఉన్న కాలనీ కమ్యూనిటీ స్థలాన్ని ఆ వెంచర్‌లో భాగంగా చూపించే ప్రయత్నం జరుగుతోందని పేర్కొన్నారు.2017లో కాలనీ ముఖద్వారం ఏర్పాటు సమయంలో కమ్యూనిటీ హాల్ కోసం స్థలాన్ని కాలనీ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచరకుంట్ల సత్తిరెడ్డి విరాళంగా ఇచ్చారని కాలనీ వాసులు తెలిపారు.2020-25 కాలంలో పాత వ్యవసాయ బావిని పూడ్చి,చదును చేసి సుమారు 800 గజాల స్థలాన్ని కాలనీ అవసరాల కోసం వినియోగించేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.ఇటీవల రాత్రి సమయంలో కంచరకుంట్ల రామ్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి తన అనుచరులతో కాలనీలోకి వచ్చి కాలనీ వాళ్ళు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశారని, అడ్డుకున్న కాలనీ వాసులు, మహిళలతో దుర్భాషలాడుతూ భయాందోళనలకు గురిచేశారని ఆరోపించారు. ఈ ఘటనపై స్థానిక ఎస్ఐ, డీఎస్పీ కి ఫిర్యాదు చేసి,ధ్వంసమైన సీసీ కెమెరాలను అధికారులకు చూపించినట్లు తెలిపారు. కమ్యూనిటీ స్థలాన్ని రక్షించి,ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే,డీఎస్పీ, మున్సిపల్ అధికారులు, చైర్మన్‌ను కాలనీ వాసులు కోరారు.ఈ కార్యక్రమంలో కోనేటి నర్సింహ,చెరుకు వెంకటేష్,ముత్యాలు ,మహేందర్, లక్ష్మి నారాయణ, అంజయ్య ,జలంధర్,లక్ష్మారెడ్డి, కృష్ణారెడ్డి, వెంకట్ రెడ్డి,నరసింహ, జంగయ్య చారి,శ్రీకాంత్, యాదమ్మ ,సుజాత, కమలమ్మ, సిరియాల,తదితర కాలనీ వాసులు పాల్గొన్నారు.

# కట్టెల లింగస్వామి రచించిన కలం కావాతు పుస్తకావిష్కరణ







**చౌటుప్పల్,అక్టోబర్07ం(తొలివార్త) :** మాజీ విద్యార్థి నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు అడ్వకేట్ కట్టెల లింగస్వామి రచించిన కలం కవాతు పుస్తకావిష్కరణ కార్యక్రమం చౌటుప్పల్ మున్సిపాలిటీ బి.ఆర్.కే కన్వెన్షన్ హాల్ లో బుధవారం ఘనంగా నిర్వహించారు.తెలంగాణ ఉద్యమకారుడు ఉప్పు కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రచయిత, కవి,ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాసిం,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కే.శ్రీనివాసు పాల్గొనగా,వివిధ సంఘాల ప్రతినిధులు నాయకులు బచ్చనగోని గాలయ్య,జిల్లా యాదయ్య,బోరం ప్రకాష్ రెడ్డి,తాడూరి పరమేష్,బాతరాజు సత్యం,బోయ రామచంద్రం,లింగస్వామి, మల్లేష్,చిలక రాజు,రాజు,సంజీవ,కొండూరు వెంకటేశం,తిగుళ్ల శ్రీనివాస్,కార్తీక్ గౌడ్,చింతల సాయిలు,ఎండి ఖయ్యూం,తడక మోహన్,కాకి సుందర్,వివిధ కళాశాలల ప్రతినిధులు విష్ణుకుమార్,మహేందర్ రెడ్డి,శ్రీనివాస్,శేఖర్ రెడ్డి,విద్యార్థిని విద్యార్థులు,వివిధ సంఘాల ప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ కాసిం మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న,జరిగినటువంటి అనేక విషయాల మీద అద్భుతమైనటువంటి అంశాలతో అక్షరాలను ఒక దగ్గర చేర్చి ఒక పుస్తకంగా తీసుకువచ్చిన కట్టెల లింగస్వామికి అభినందనలు తెలిపారు.ఈ ప్రాంతం పోరాట నేపథ్యం ఉన్నదని సర్వేల్,సంస్థాన్ నారాయణపురం,చౌటుప్పల్ తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించి నేడు సాహిత్యంలో కూడా మొదటి అడుగు వేయడం అభినందనీయమని ఈ ప్రాంతంలోని ఇంకా అనేక సమస్యల మీద కవితలు పుస్తకాలు రావాలని ఆకాంక్షించారు.కవి తన యొక్క బతుకును ఆవిష్కరించడంతోపాటు ప్రజల బతుకులను కూడా ఈ పుస్తకంలో ఆవిష్కరింప చేసిన ప్రయత్నం చాలా గొప్పదని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు.విద్యార్థిగా అధ్యాపకునిగా రచయితగా ఇంకా మరింత ముందు కొనసాగాలని ఆకాంక్షించారు.ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ స్థానికంగా ఉన్నటువంటి నిరుద్యోగం కాలుష్యం మీద విద్యార్థులు యువత స్పందించేలా చైతన్యం అయ్యే విధంగా పుస్తక రచన కవితల రచన కావాలని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకునిగా పనిచేస్తూ అధ్యాపకునిగా రచయితగా ఒక పుస్తకాన్ని ముందుకు తీసుకురావడం హర్షించదగిన విషయమని,దేశంలో జరుగుతున్నటువంటి అనేక ఉద్యమాలకు ఇలాంటి పుస్తకాలు పూర్తి కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు మిత్రులు రచయితను ఘనంగా సన్మానించారు.

## క్రాంతి నగర్‌లో రూ.16 లక్షల సిఎంసీ నిధులతో సీసీ రోడ్డు ప్రారంభం



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 07 ( తొలివార్త ):ప్రతి నిధి.** బాచుపల్లి: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని క్రాంతి నగర్‌లో సిఎంసీ నిధులు రూ.16 లక్షల వ్యయంతో 110 మీటర్ల పొడవున నిర్మించిన సీసీ రోడ్డును కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ, నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజలకు నిత్యం ఉపయోగపడే రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, అవసరమైన చోట నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కొలన్ జీవన్ రెడ్డి, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, కోటపాటి మురళి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ బాల్ రెడ్డి, పద్మారావు, మనోజ్ పాల్గొన్నారు. అలాగే శ్రీ హోమ్స్ కాలనీ అధ్యక్షులు అంజయ్య గౌడ్, క్రాంతి నగర్ కాలనీ అధ్యక్షులు బుగ్గ రెడ్డి, క్రాంతి నగర్ అసోసియేషన్ కోశాధికారి శ్రీధర్, ఉపాధ్యక్షులు తోట హరిబాబు, కాంగ్రెస్ నాయకులు నరేష్, నవీన్ కుమార్, నరసింహులు, కృష్ణ, జగదీష్, భాషా, శ్రవణ్ మరియు క్రాంతి నగర్ సోషల్ వెల్ఫేర్ టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జన్మదినం సందర్భంగా..శ్రీ లక్ష్మీ గణపతి మరియు థర్డ్ బంద్ శ్రీఆంజనేయ స్వామి ని దర్శించుకున్నా సీనియర్ జర్నలిస్ట్ ముక్క దేవేందర్ గుప్తా..



**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, అక్టోబర్ 07 ( తొలివార్త ):ప్రతి నిధి.** జన్మదినం సందర్భంగా..శ్రీ లక్ష్మీ గణపతి..థర్డ్ బంద్ శ్రీఆంజనేయ స్వామి కి పూజ పూజలు.. సీనియర్ జర్నలిస్ట్ ముక్క దేవేందర్ గుప్తా..నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీ లోని శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయం లో సీనియర్ జర్నలిస్ట్ కాలనీ ఉపాధ్యక్షుడు ముక్క దేవేందర్ గుప్తా పుట్టినరోజు సందర్భంగా, ఆలయ పూజారి రాకేష్ పంతులు ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు కలగాలని స్వామివారి ఆశీర్వాదాలు అందించి,శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించి, జన్మదినశుభాకాంక్షలు తెలిపారు, ముందుగా థర్డ్ బంద్ లోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో పుట్టినరోజు సందర్భంగా, ముక్క దేవేందర్ అనురాధ గుప్తా దంపతులు స్వామివారికి, తమలపాకులతో చేసిన ఆరని సమర్పించి, ఆలయ పూజారి స్వామివారి ఆశీర్వాదాలు అందజేశారు, దేవస్థానం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు గోవిందరావు భవ్య టివి కె వి వి, సత్యనారాయణ, వెంకట్రావు , బంటి, సభ్యులు బంధుమిత్రులు, ఇలాంటి పుట్టినరోజులు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని శాలువలతో సత్కరించి శుభకాంక్షలు తెలిపారు,

## తనికెళ్ళ గ్రామంలో ఆర్.సి.యం చర్చి వారి ఆధ్వర్యంలో ఘనంగా జపమాల మాత ఉత్సవాలు.

**జపమాల మాత దీవెనలు ప్రజలందరి మీద ఉండాలి.**

**విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ అగస్టీన్.**





**కొనిజర్ల అక్టోబర్ 07 ( తొలివార్త ):** తనికెళ్ల గ్రామంలోని ఆర్.సి.యం చర్చి వారి ఆధ్వర్యంలో జపమాల మాత ఉత్సవాలు విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ అగస్టీన్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ అగస్టీన్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రభువు తల్లి అయిన మరియమాత మధ్యస్థ ప్రార్థన వలన ప్రజలందరి మీద కృపవరాలు విరాళంగా కురవాలని, ప్రజలందరూ పాడిపంటలతో సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో జపమాల మాత ఆశీస్సులు ప్రజలందరి మీద మన సంఘం మీద మన విచారణ మీద ఉండాలని, ప్రతి ఒక్క క్రైస్తవ బిడ్డ జపమాల మాత మరియ తల్లిని ప్రేమ పూర్వకంగా జపపాలను జపిస్తూ ఆమె యొక్క ఆశీర్వాదాలు పొందాలని, ప్రతి కుటుంబం సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని, తల్లి మరి ఆశీస్సులు ప్రజలందరి మీద ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెయింట్ అలోసిస్ సిస్టర్స్, ఉపదేశులు సంఘ పెద్దలు సంఘ విశ్వాసులు మరియదల సభ్యులు యువత యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీటీసీ అంతోటి రమేష్ తండ్రి అంతోటి గోపయ్య మృతి

**గోపయ్య కుటుంబాన్ని పరామర్శించిన కృష్ణ సాగర్ సర్పంచ్ తాటి వాణి**



**భద్రాద్రి జిల్లా బూర్గంపాడు అక్టోబర్ 07 ( తొలివార్త ):** కృష్ణసాగర్ గ్రామపంచాయతీ పరిధిలోని కృష్ణ సాగర్ ఎస్సీ కాలనీ గ్రామానికి చెందిన అంతోటి గోపయ్య అకాల మరణం చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను గ్రామ సర్పంచ్ తాటి వాణి పరామర్శించారు. ఈ సందర్భంగా తాటి వాణి కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గోపయ్య మృతి గ్రామానికి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలతో సన్నిహితంగా ఉంటూ అందరికీ అండగా నిలిచిన గోపయ్య మృతి పట్ల గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు గుర్రం సురేష్, 3వ వార్డు సభ్యులు మడకం దేవ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ధార రాము, పోడియం సాంబ, బొజ్జ మైకుల్, గడేసుల చార్లెస్, పాలకవర్గ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ పెద్ద సోడే అర్జున్, పస్తం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని అంతోటి గోపయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, శ్రద్ధాంజలి ఘటించినారు.

## సారపాక లో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం

**జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు , జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు**



**భద్రాద్రి జిల్లా బూర్గంపాడు అక్టోబర్ 07 ( తొలివార్త ):** సారపాకలో అక్టోబర్ 11 వ తారీఖున జరిగే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు.బుధవారం నాడు సంఘం మండల కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివారం నాడు జరిగే రాజకీయ శిక్షణా తరగతుల్లో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, జాతీయ కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, జిల్లా అద్యక్ష, కార్యదర్శులు అన్నవరపు కనకయ్య,రేపాకుల శ్రీనివాస్ లు ముఖ్య అతిధులుగా పాల్గొంటారని తెలిపారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలు,పోడు భూముల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్నామన్నారు, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి వీబీజీరామ్ జి చట్టాన్ని ఏకపక్షంగా తీసుకువచ్చిందని విమర్శించారు.దేశ వ్యాప్తంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని ఆందోళనలు నిర్వహిస్తున్నామన్నారు, జిల్లాలో పెండింగ్ లో ఉన్న పోడు భూములకు పట్టాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎస్కే అబీద,కమటం మరియమ్మ,బయ్య రాము, తిరుపతిరావు,ముంగి శివ తదితరులు పాల్గొన్నారు.

## పర్మిషన్స్ లేకుండానే సీబీఎస్ఈ తరగతులు నిర్వహిస్తున్న

# శ్లోక గ్లోబల్ స్కూల్







- ఉప్పల్ భగాయత్ శ్లోక గ్లోబల్ స్కూల్‌లో అడ్డగోలు దోపిడీ
- 7వ తరగతి పర్మిషన్‌తో 10వ తరగతి వరకు దందా
- ఎంఈఓ రామారావుకు భారీగా ముడుపులు అందాయనే ఆరోపణలు
- విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలు నోరుమెదపని యాజమాన్యం

**ఉప్పల్ అక్టోబర్ 07 ( తొలివార్త ):** రాష్ట్రంలో విద్యాశాఖ తీరు 'గుడ్డి గుర్రానికి పగ్గాలు ఇచ్చినట్లు'గా తయారైంది. సక్రమంగా పనిచేసి విద్యా వ్యవస్థను గాడిలో పెట్టాల్సిన యంత్రాంగం అస్తవ్యస్తంగా మారి అక్రమాలకు అడ్డాగా నిలుస్తోంది. యథా రాజా తథా ప్రజా అన్న చందంగా అధికారుల అండదండలతో ప్రైవేట్ విద్యాసంస్థలు సామాన్య, మధ్యతరగతి ప్రజల జేబులు గుల్ల చేస్తున్నాయి. నాణ్యమైన విద్య అందుతుందనే నమ్మకంతో ప్రైవేట్ పాఠశాలల వైపు పరుగులు తీస్తున్న తల్లిదండ్రుల ఆశలను ఆసరాగా చేసుకుని, వందలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోంది ఉప్పల్ భగాయత్‌లోని 'శ్లోక పాఠశాల'. ఈ పాఠశాల యాజమాన్యం ఎలాంటి సీబీఎస్ఈ **(C.B.S.E)** అనుమతులు లేకుండానే అక్రమంగా సీబీఎస్ఈ తరగతులను నిర్వహిస్తూ రూ.లక్షల్లో ఫీజులు గుంజుతోంది. ప్రభుత్వం నుంచి కేవలం 7వ తరగతి వరకు మాత్రమే స్టేట్ సిలబస్ అనుమతులు పొందిన ఈ స్కూల్, అధికారుల కళ్లు గప్పి 10వ తరగతి వరకు తరగతులు నడుపుతూ దందా సాగిస్తోంది. అసలు అనుమతులే లేని తరగతుల్లో పిల్లలను చేర్చుకుంటూ, డబ్బే ప్రామాణికంగా విద్యాబోధన పేరిట తల్లిదండ్రులను, విద్యార్థులను నిలువునా మోసం చేస్తోంది. ఇంత పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. అయితే స్థానిక ఉప్పల్ ఎంఈఓ రామారావు చొరవతోనే ఈ అడ్డగోలు వ్యవహారం నడుస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల నడుస్తున్నా ఎంఈఓ కానీ, పాఠశాల యాజమాన్యం కానీ నోరు మెదపకపోవడం వెనుక పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాధనాన్ని, విద్యార్థుల జీవితాలను పణంగా పెడుతూ అక్రమ వసూళ్లకు తెగబడుతుంటే విద్యాశాఖ అధికారులు కనీసం సమీక్షించకపోవడం గమనార్హం. వందలాది మంది విద్యార్థుల జీవితాలు నాశనమవుతుంటే, విద్యాశాఖ బాధ్యతలు చూస్తున్న అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కీలక శాఖలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రికి ఈ అక్రమాల బాగోతం తెలియకనా? లేక క్షేత్రస్థాయి అధికారుల చేతికందిన అమ్యామ్యాలతో చూసీ చూడనట్లు వదిలేస్తున్నారా అని బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి శ్లోక పాఠశాల అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన యాజమాన్యంపై, వారికి సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.




## తీవ్ర దశకు ఎల్‌నినో వచ్చే ఏడాది మే నాటికి సాధారణ పరిస్థితులు

ఎల్‌నినో తీవ్ర దశకు చేరిందని దాని పర్యవసానమే ప్రపంచవ్యాప్తంగా ఎన్నడూ లేనంత వేడిగా మారిపోయిందని విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం సముద్ర అధ్యయన, వాతావరణ విభాగం సీనియర్ ఆచార్యులు పి.సునీత తెలిపారు. ఎల్‌నినో ప్రస్తుతం తీవ్ర దశకు చేరుకుందని, ఈ కారణంగానే భూగోళం ఎన్నడూ లేనంత వేడిగా మారిపోయిందని విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం సముద్ర అధ్యయన, వాతావరణ విభాగం సీనియర్ ఆచార్యులు పి.సునీత తెలిపారు. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తుపానుగా మారకపోవడానికి ఇదొక కారణమై ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. దీనిపై పరిశోధన జరుగుతున్నట్లు చెప్పారు. ఎల్‌నినో పరిస్థితులపై ఆమె మాట్లాడుతూ ఎల్‌నినో తీవ్రత వచ్చే ఏడాది జనవరి వరకు ఉంటుందని ఏప్రిల్-మే నాటికి సాధారణ స్థితి ఏర్పడుతుందని తెలిపారు.ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపడానికి సముద్ర గర్భంలోని ఉష్ణోగ్రత పెరగడమూ ఓ కారణంగా కనిపిస్తోందని పి.సునీత తెలిపారు. పసిఫిక్ మహాసముద్రంలోని 50 మీటర్ల నుంచి 300 మీటర్ల లోతులో వేడి ఎక్కువగా ఉందని అక్కడ 2-4 డిగ్రీల మేర ఉష్ణోగ్రత పెరిగిందని చెప్పారు. ఈ సూపర్ ఎల్‌నినో తీవ్ర వర్షాభావ పరిస్థితులకు దారి తీయడమే కాకుండా వాతావరణంలో ఇంకా ఏ రకమైన మార్పులు జరుగుతాయో అప్పుడే చెప్పలేమని దాన్ని నిశితంగా పరిశీలిస్తున్నామని వెల్లడించారు.పొడి గాలుల ప్రభావంతో దేశంలో 70 శాతం వర్షపాతం నైరుతి రుతుపవనాల వల్లే ఉంటుందని సునీత అన్నారు. పసిఫిక్ మహాసముద్రం వేడెక్కడం వల్ల మేఘాలు తూర్పునకు మళ్లుతున్నాయని దీనివల్ల భారత్, ఇండోనేసియా ప్రాంతాల్లో పొడి గాలులు ఏర్పడి మేఘాలు తగ్గుతున్నాయని చెప్పారు. ఈ కారణంగానే సుదీర్ఘ వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. జూన్ నుంచి సెప్టెంబరు వరకు దేశంలో సగటున 868 మి.మీ. వర్షపాతం కురవాల్సి ఉండగా 759 మి.మీ. మాత్రమే కురిసిందని వివరించారు.ఈ లెక్కన 13 శాతం లోటు ఉండగా, దక్షిణ భారతంలో అది 24 శాతంగా ఉందని తెలిపారు. పశ్చిమ హిందూ మహాసముద్రం వేడెక్కడం మొదలైతే ఎల్‌నినో ప్రభావం తగ్గుతుందని ఈ ఏడాది డిసెంబరులోగా ఐవోడీ తీవ్రరూపం దాల్చి తగ్గుముఖం పడుతుందని అన్నారు. ఈశాన్య రుతుపవనాల సమయంలో పాజిటివ్ ఐవోడీ, ఎల్‌నినో వల్ల బంగాళాఖాతంలో ఏర్పడే తుపాన్లు ఎక్కువ రోజులు ఉండేందుకు అవకాశం ఉందని వెల్లడించారు.మూడు దశాబ్దాల్లో ఈసారే అధికం: పసిఫిక్ మహాసముద్రం ఉపరితల ఉష్ణోగ్రత సాధారణంగా 28 డిగ్రీలు ఉంటుందని అది పెరిగితే ఇండెక్స్‌ల్లో మార్పులు చోటుచేసుకుంటాయని సునీత తెలిపారు.

## రూ.300 దర్శనం టికెట్ల విడుదల బ్రహ్మోత్సవాల వేళ ఆ 10 రోజులు వీఐపీ బ్రేక్ రద్దు

శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను టీటీడీ నేడు విడుదల చేయనుంది. 11 నుంచి 20 వరకు వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసింది. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి భక్తులకు టీటీడీ కీలక అప్‌డేట్ ఇచ్చింది. శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను బుధవారం (ఈ నెల 7న) ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. మరోవైపు బ్రహ్మోత్సవాలు, పెరటాసి మాసం రద్దీ నేపథ్యంలో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ పలు ప్రత్యేక దర్శనాలను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. శ్రీవారి హుండీ ఆదాయం వివరాలను సైతం వెల్లడించింది.శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ నెలలో వైభవంగా జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల సమయంలో స్వామివారిని దర్శించుకునేందుకు వీలుగా ఈ నెల 12, 13, 14, 19, 20వ తేదీలకు సంబంధించిన రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను టీటీడీ బుధవారం జారీ చేయనుంది. ఉదయం సరిగ్గా 10 గంటలకు ఆన్‌లైన్‌లో ఈ టికెట్లను అందుబాటులో ఉంచనుంది. భక్తులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే ఈ టికెట్లను ముందస్తుగా బుక్ చేసుకోవాలని టీటీడీ అధికారులు సూచించారు.ఆ పది రోజులు వీఐపీ బ్రేక్ రద్దు : తిరుమలలో బ్రహ్మోత్సవాల సందడి నెలకొననుంది. దీనికి తోడు తమిళులకు ఎంతో పవిత్రమైన పెరటాసి మాసం చివరి వారం కూడా కావడంతో తిరుమలలో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగే అవకాశం ఉంది. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని టీటీడీ ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు వీఐపీ బ్రేక్ దర్శనాలను పూర్తిగా రద్దు చేసింది. కేవలం ప్రొటోకాల్ ఉన్న ప్రముఖులకు మాత్రమే బ్రేక్ దర్శనానికి అనుమతిస్తామని స్పష్టం చేసింది.సిఫార్సు లేఖలు స్వీకరించరు : వీఐపీ బ్రేక్ దర్శనాలతో పాటు మరికొన్ని ప్రత్యేక దర్శనాలను కూడా టీటీడీ ఈ నెల 11 నుంచి 20 వరకు తాత్కాలికంగా నిలిపివేసింది. వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు, ఎన్ఆర్ఐలు, డిఫెన్స్ విభాగాల సిబ్బందికి కల్పించే ప్రత్యేక దర్శనాలను ఈ పది రోజుల పాటు రద్దు చేసింది. వీఐపీ బ్రేక్ దర్శనాలకు సంబంధించి ఈ నెల 10 నుంచి 19వ తేదీ వరకు ఎలాంటి సిఫార్సు లేఖలను స్వీకరించబోమని టీటీడీ స్పష్టం చేసింది. భక్తులు ఈ విషయాన్ని గమనించి తమ యాత్రను ప్రణాళిక చేసుకోవాలని



సూచించిందితిరుమలేశుడికి భక్తులు సమర్పించుకుంటున్న కానుకల ఆదాయం వివరాలను టీటీడీ వెల్లడించింది. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు (తొమ్మిది నెలల్లో) శ్రీవారి హుండీ ద్వారా ఏకంగా రూ.1,129 కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇందులో జులై నెలలో అత్యధికంగా రూ.140.25 కోట్లు లభించగా, ఆగస్టులో రూ.137.44 కోట్లు, సెప్టెంబర్ నెలలో రూ.126.41 కోట్ల ఆదాయం స్వామివారి హుండీ ద్వారా సమకూరినట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు.

## మసకబారుతున్న నమ్మకం ట్యాక్సీ డ్రైవర్లు, రైడర్ల తప్పిదాలతో మహిళా భద్రతపై ఆందోళన

ప్రైవేటు రవాణా వ్యవస్థలో కొందరు డ్రైవర్లు, రైడర్ల తప్పిదాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. క్యాబ్‌లు, బైక్ ట్యాక్సీలతో మహిళలు ఏ సమయంలోనైనా గమ్యం చేరగలరనే నమ్మకం మసకబారుతోంది. హైదరాబాద్‌లో క్యాబ్‌లు, బైక్‌ట్యాక్సీలతో ఏ సమయంలోనైనా గమ్యం చేరగలమనే నమ్మకం క్రమంగా మసకబారుతోంది. ప్రైవేటు రవాణా వ్యవస్థలో కొందరు డ్రైవర్లు, రైడర్ల తప్పిదాలు ఇటీవలి కాలంలో ఆందోళనకు గురిచేస్తున్నాయి. నకిలీ పేర్లు, వివరాలతో నేరస్థులు డ్రైవర్లు, రైడర్లుగా పనిచేస్తున్న ఉదంతాలు ఎక్కువగా వెలుగులోకి వస్తున్నాయి.

### ఇటీవల చోటుచేసుకున్న ఘటనలు

శంషాబాద్ నుంచి గచ్చిబౌలికి క్యాబ్ బుక్ చేసి ప్రయాణిస్తున్న మహిళపై డ్రైవర్ అఘాయిత్యం చేయడానికి యత్నించాడు. వెంటనే కేకలు వేయడంతో ఆమె వద్ద ఉన్న నగదుతో పరారయ్యాడు. మరో ఘటనలో ఎయిర్‌పోర్టుకు కారులో బయల్దేరిన ఎయిర్‌లైన్స్ ఉద్యోగినిపై డ్రైవర్ లైంగిక దాడి చేయడానికి యత్నించాడు. ఆమె అరవడంతో అక్కడే వదిలేసి క్షణాల్లో మాయమయ్యాడు. మణికొండ నుంచి జూబ్లీహిల్స్‌కు బైక్ ట్యాక్సీ బుక్ చేసుకుని ప్రయాణిస్తున్న యువతి పట్ల రైడర్ అనుచితంగా ప్రవర్తించాడు. హైదరాబాద్ నగర శివార్లలో మరో రైడర్ గృహిణికి ఫోన్ చేసి వేధించడం, రాత్రిళ్లు అసభ్యకరమైన ఫొటోలు, వీడియోలు పంపి ఆమె ఇబ్బందులకు గురి చేశాడు. ఇటీవల కాలంలో ఇలాంటి ఘటనలో అనేకం వెలుగులోకి వస్తున్నాయి.

### శంషాబాద్ ఎయిర్‌పోర్టు



ఇంతకు ముందు ప్రయాణికులను తీసుకెళ్లే క్యాబ్‌లు, డ్రైవర్ల వివరాలు ముందుగా రిజిస్టర్ చేసేవారు. పోలీసులు వాటికి ప్రత్యేక నెంబర్, క్యూఆర్ కోడ్ కేటాయించే ప్రక్రియ ఉండేది. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రోజూ సుమారు 5 వేలకు పైగా అనుమతి పొందిన క్యాబ్స్ రాకపోకలు కొనసాగిస్తుంటాయి. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో అనుమతి లేని వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయి. రెండు నెలల వ్యవధిలో 50 మంది క్యాబ్‌డ్రైవర్లపై శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పోలీసులు కేసులు నమోదు చేయటం మహిళల భద్రతపై ఆందోళన కలిగిస్తోంది.

### పర్యవేక్షణేది నియంత్రణ జాడేది

మహానగరం హైదరాబాద్‌లోని గిగ్ వేదికల్లో నమోదు ప్రక్రియలో ఉన్న లోపాలతో నేరస్థులు, విదేశీయులు క్యాబ్ డ్రైవర్లు, బైక్ రైడర్లుగా చలామణి అవుతున్నారు. బంగ్లాదేశ్ నుంచి నకిలీ ఆధార్ కార్డుతో వచ్చిన నలుగురు యువకులు బైక్‌ట్యాక్సీ నడుపుతూ ఇటీవల పోలీసులకు పట్టుబడ్డారు. రిజిస్ట్రేషన్ సమయంలో డ్రైవర్, రైడర్‌ల వ్యక్తిగత వివరాలను పోలీసులు కచ్చితంగా పరిశీలించాలనే నిబంధనను చూసీ చూడనట్టు వదిలేయడం వల్లనే ఇలాంటి తప్పిదాలు చోటుచేసుకుంటున్నాయి.ఇటీవల నాగోల్‌లో ఓ క్యాబ్ డ్రైవర్ హత్యకు గురయ్యాడు. దర్యాప్తులో అతడు రౌడీషీటర్ అని తెలియడంతో పోలీసులే షాకయ్యారు. ఇటీవల యువతులు, గృహిణులపై కొందరు క్యాబ్ డ్రైవర్లు, బైక్ రైడర్లు వేధింపులకు పాల్పడుతున్నట్టు పోలీసులకు అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ ఏడాది ఇలాంటి ఘటనల్లో ఇప్పటి వరకు 35 మందిపై కేసులు నమోదు చేశారు.

## కొత్తగా 2 పోలీస్‌స్టేషన్లు, 3 శాంతి భద్రతల డివిజన్లు

### ఫ్యూచర్‌సిటీ కమిషనరేట్ పరిధిలో భారీ మార్పులు

ప్రభుత్వం ఫ్యూచర్‌సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీ మార్పులు చేసింది. 3 కొత్త శాంతి భద్రతల డివిజన్లు, 2 కొత్త పోలీస్ స్టేషన్లను ఏర్పాటుచేస్తూ నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రభుత్వం ఫ్యూచర్‌సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీ మార్పులు చేపట్టింది. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పునర్వ్యవస్థీకరణ తర్వాత ఫ్యూచర్‌సిటీ కమిషనరేట్ పరిధిలో మార్పులు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. 3 కొత్త శాంతి భద్రతల డివిజన్లు, 2 కొత్త పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది.దీంతోపాటు రెండు ట్రాఫిక్ జోన్లుగా ఫ్యూచర్‌సిటీ కమిషనరేట్‌ను పునర్వ్యవస్థీకరించింది. 3 ట్రాఫిక్ డివిజన్లు, 3 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేసింది. అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్‌ను ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని మహేశ్వరం జోన్‌లోకి మార్చింది. మొయినాబాద్, ఆమనగల్, కొత్తూరు పేర్లతో కొత్త శాంతిభద్రతల డివిజన్లను ఏర్పాటు చేసింది. అజీజ్‌నగర్‌లో కొత్త పీఎస్, మహేశ్వరం, షాద్‌నగర్, చేవెళ్ల పేర్లతో 3 కొత్త ట్రాఫిక్ డివిజన్లు ఏర్పాటు చేసింది.

### శంషాబాద్ పీఎస్ పేరు మార్పు

శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పేరును పెదషాపూర్‌గా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఠాణా పరిధిలోని కొన్ని ప్రాంతాలూ మారాయి. పెదషాపూర్ స్టేషన్‌ను షాద్‌నగర్ జోన్ కొత్తూరు డివిజన్, షాద్‌నగర్ జోన్ పరిధిలోకి చేరుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతంలో శంషాబాద్, ఆర్జీఐఏ పేర్లతో రెండు పీఎస్‌లు ఉండేవి. ఇప్పుడు ఆర్జీఐఏ పీఎస్‌ను శంషాబాద్‌గా పేరు మార్చింది. గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్‌ను మీర్‌ఖాన్‌పేట్ పీఎస్‌గా మార్చింది.

### రెండు ట్రాఫిక్ జోన్లుగా

ఫ్యూచర్‌సిటీలో ఉన్న ట్రాఫిక్ జోన్‌ను ట్రాఫిక్-1, ట్రాఫిక్-2 పేర్లతో రెండు ట్రాఫిక్ జోన్లుగా ఏర్పాటు చేసింది. మొయినాబాద్, కొత్తూరు, ఆమనగల్ పేర్లతో 3 కొత్త ట్రాఫిక్ పీఎస్‌లు ఏర్పాటు చేసింది. షాబాద్, మొయినాబాద్, అజీజ్‌నగర్ ఠాణాలు మొయినాబాద్ ట్రాఫిక్ డివిజన్ పరిధిలోకి తీసుకొస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

### మూడు మహిళా పోలీస్‌స్టేషన్లకు అంకురార్పణ

నూతనంగా అజీజ్‌నగర్ ఠాణా ఏర్పాటైంది. మొయినాబాద్ పరిధిలోని కొన్ని ప్రాంతాలను ఈ ఠాణా పరిధిలోకి తీసుకొచ్చారు. జోన్‌కు ఒకటి చొప్పున మహేశ్వరం, చేవెళ్ల, షాద్‌నగర్ పేర్లతో మూడు మహిళా పోలీస్‌స్టేషన్లకు అంకురార్పణ చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ ఠాణా ప్రస్తుతం మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో ఉంది. దాన్ని ఫ్యూచర్‌సిటీ పరిధిలోని మహేశ్వరం జోన్‌లోకి తీసుకొచ్చింది. అబ్దుల్లాపూర్‌మెట్ పరిధి పూర్తిగా మారింది. గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్‌కు మీర్‌ఖాన్‌పేటగా పేరు పెట్టారు.

## కేబీఆర్ పార్కు ప్రాజెక్టు రద్దు పంజాగుట్ట, జూబ్లీహిల్స్‌ను కలుపుతూ ఎలివేటెడ్ కారిడార్



కేబీఆర్ పార్కు చుట్టూ ఏడు కూడళ్లలో అండర్‌పాస్‌లు, స్టీలు వంతెనలు నిర్మించే పనులను రద్దు చేసిన ప్రభుత్వం బదులుగా పొడవైన పైవంతెన నిర్మాణానికి అనుమతించింది. రాజధాని నగరం హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యను పరిష్కారించడానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పంజాగుట్ట, జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి రోడ్డును కలుపుతూ ఆరు లేన్లతో 4 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేబీఆర్ పార్కు చుట్టూ ఏడు జంక్షన్‌లలో అండర్‌పాస్‌లు, స్టీలు ఫ్లైఓవర్‌లు నిర్మించే పనులను రద్దు చేసి దాని స్థానంలో పొడవైన ఫ్లైఓవర్ నిర్మాణానికి అనుమతించింది. ఆ మేరకు మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

### పూర్తిగా మార్చేసిన వన్ వే

పంజాగుట్ట, హైటెక్‌సిటీ మధ్య ప్రతి రోజు లక్షకుపైగా వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఆయా వాహనాలు పంజాగుట్ట నాగార్జున సర్కిల్, ముగ్ధ జంక్షన్, కేబీఆర్ పార్కు, జూబ్లీ చెక్‌పోస్టు జంక్షన్‌లలో ట్రాఫిక్ సిగ్నళ్ల కారణంగా రోజూ 20 నిమిషాలు ఆగాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కేబీఆర్ పార్కు చుట్టూ కూడళ్లలో స్టీలు బ్రిడ్జిలు, అండర్‌పాస్‌ల నిర్మాణం కోసం పనులు ప్రారంభించింది. అవి వేగం పుంజుకున్న దశలో వాహనాల దారి మళ్లింపులో భాగంగా కేబీఆర్ పార్కు చుట్టూ చేపట్టిన వన్ వే విధానం వ్యవహారాన్ని పూర్తిగా మార్చేసింది. పార్కు చుట్టూ వాహనాలు సాఫీగా సాగిపోతుండటంతో అధికారులు వన్ వే విధానాన్ని శాశ్వతం చేశారు. కేబీఆర్ అభివృద్ధి ప్రాజెక్టును రద్దు చేయాలని, బదులుగా ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలన్న జీహెచ్ఎంసీ ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

### మేఘాకు ఎలివేటెడ్ కారిడార్ పనులు

ప్యాకేజీ-1లో భాగంగా రూ.580 కోట్లతో పలు జంక్షన్‌లను అభివృద్ధి చేసేందుకు తలపెట్టిన పనులకు బదులుగా జూబ్లీ చెక్‌పోస్టు నుంచి ముగ్ధ కూడలి వరకు, ప్యాకేజీ-2 కింద రూ.510 కోట్లతో నిర్మించాలనుకున్న అండర్‌పాస్‌లు, స్టీలు బ్రిడ్జిలకు బదులుగా ముగ్ధ జంక్షన్ నుంచి ముఫకంజా కాలేజీ వరకు ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలని ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అనుమతి ఇచ్చింది. దీనికి సంబంధించిన కాంట్రాక్టు పనులను మేఘా కంపెనీకి అప్పగించింది. ఈ ఒప్పందం ప్రకారం రెండేళ్లలో పనులు మొత్తం పూర్తి కావాలి. ఇవి పూర్తయితే పంజాగుట్ట నుంచి నిమిషాల వ్యవధిలోనే మాదాపూర్ చేరుకోవచ్చు.

## హైదరాబాద్‌లో కెనడియన్ భర్తకు భార్య పుంసత్వ పరీక్ష.. రూ. 2 కోట్ల డిమాండ్

### ఎన్నారై భర్తను వేధిస్తున్న భార్య కుటుంబం

### బలవంతంగా నపుంసకత్వ పరీక్ష చేయించారని ఆరోపణ

### పాస్‌పోర్టు, ఇతర పత్రాలు లాక్కున్నారని బాధితుడి ఆవేదన



బాధితుడి ఫిర్యాదుతో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు నగరంలోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వింత ఘటన వెలుగులోకి వచ్చింది. తన భార్య, ఆమె కుటుంబ సభ్యులు తనను బలవంతంగా ఆసుపత్రికి తీసుకెళ్లి పుంసత్వ పరీక్షలు చేయించి, రూ. 2 కోట్లు డిమాండ్ చేస్తూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని కెనడా పౌరుడైన ఓ ఎన్నారై పోలీసులకు ఫిర్యాదు చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా దొమ్మరపోచంపల్లికి చెందిన బాధితుడికి ఇటీవలే వివాహమైంది. ఆయన ఫిర్యాదు ప్రకారం, గత నెల 7వ తేదీన తన భార్య, ఆమె కుటుంబ సభ్యులు తనకు తెలియకుండా పాస్‌పోర్టు, కెనడియన్ పౌరసత్వ పత్రం, జనన ధ్రువీకరణ పత్రాలను తీసుకెళ్లారు. ఆ తర్వాత రెండు రోజులకు, అంటే 9వ తేదీన, తనను బెదిరించి సోమాజిగూడలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లి బలవంతంగా పుంసత్వ పరీక్షలు చేయించారు.ఆ పరీక్షల తర్వాత, అతడికి నపుంసకత్వం ఉందని అసత్య ప్రచారం చేస్తూ, ఈ విషయం బయటపెట్టకుండా ఉండాలంటే రూ. 2 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారని బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి వేధింపులు భరించలేక, బాధితుడు పంజాగుట్ట పోలీసులను ఆశ్రయించాడు. తనను బెదిరింపులకు గురిచేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరాడు.బాధితుడి ఆరోపణల మేరకు, న్యాయస్థానం అనుమతితో పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు ప్రాథమిక దశలో ఉంది. అయితే, ఈ కేసు కేవలం బాధితుడి ఫిర్యాదు ఆధారంగానే నమోదైంది. నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న భార్య, ఆమె కుటుంబ సభ్యుల వాదన ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసుల దర్యాప్తు పూర్తయితేనే ఈ ఘటనపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# రుణ గ్రహీతలకు షాక్.. వడ్డీ రేట్లు పెంచిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా..!



పెరుగుతున్న ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ప్రధాన కేంద్ర బ్యాంకులు ద్రవ్య విధానాన్ని కఠినతరం చేస్తున్న తరుణంలో వడ్డీ రేట్లపై ఆర్బీఐ కూడా కీలక నిర్ణయం తీసుకుంది. అందరు అనుకున్నట్లుగానే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వడ్డీ రేట్లను పెంచింది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ బుధవారం ద్వైమాసిక ద్రవ్య విధానాన్ని ప్రకటించింది. ఇందులో భాగంగా రెపో రేటును 5.25 శాతం నుంచి 5.50 శాతానికి పెంచింది. బోర్డు 25 బేసిస్ పాయింట్లు పెంచాలని ఏకగ్రీవంగా నిర్ణయించింది. పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న సంఘర్షణ కారణంగా ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరుగుతున్న నేపథ్యంలో, దాదాపు మూడేళ్లన్నర కాలం తర్వాత ఈ కీలక వడ్డీ రేటు నిర్ణయం తీసుకుంది. 2023 ఫిబ్రవరి తర్వాత వడ్డీరేట్లను ఆర్‌బీఐ పెంచడం ఇదే తొలిసారి. 2023 ఫిబ్రవరిలో చివరిసారిగా రెపో రేటును ఆర్‌బీఐ 0.25% పెంచి, 6.5 శాతానికి పెంచింది. 2025లో వడ్డీ రేట్ల తగ్గింపు ప్రక్రియను ప్రారంభించే వరకు, 2023-24 ఆర్థిక సంవత్సరం అంతా ఈ రేటు కొనసాగింది. ఆ తర్వాత గతేడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ రేట్లు తగ్గించింది. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. డిసెంబరులో 0.25 కోత విధించింది. ఈ కోతలతో రెపో రేటు 1.25 శాతం వరకు తగ్గింది. ఆర్బీఐ తాజా నిర్ణయంతో హోం లోన్, వెహికిల్ లోన్లపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. రిజర్వ్ బ్యాంఖ్ ఇండియా ఈ సంవత్సరం ఫిబ్రవరి, ఏప్రిల్, జూన్, ఆగస్టులో జరిగిన ద్రవ్య విధానం సమావేశంలో వడ్డీ రేట్లను యథాతంగా ఉంచింది. రుణగ్రహీతలకు షాక్.. రెపో రేటును 5.50 శాతానికి పెంచిన ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ఆర్థిక కార్యకలాపాల ఊపు విస్తృత ప్రాతిపదికన కొనసాగుతోందని పేర్కొన్నారు. భవిష్యత్తులో, ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, సరఫరా గొలుసు అంతరాయాలు దేశీయ ఆర్థిక కార్యకలాపాలపై కొంత ప్రభావం చూపవచ్చని తెలిపారు. బలహీనమైన రుతుపవనాలతో పాటు బలమైన ఎల్ నినో రాబోయే రబీ సీజన్‌పై ప్రభావం చూపవచ్చని అంచనా వేశారు. ఆర్‌బిఐ 2027 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 40 బేసిస్ పాయింట్లు పెంచి 7.1 శాతానికి చేర్చింది. ఆర్‌బిఐ ఎంపిసి గతంలో ఆగస్టులో 2027 ఆర్థిక సంవత్సరానికి 6.7% వృద్ధిని అంచనా వేసింది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# గుడ్ న్యూస్.. దసరాకు ముందే కొత్త పింఛన్లు..!



రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. దసరా కానుకగా చేయూత పథకం కింద చేయూత పింఛన్లు ఇచ్చేందుకు సిద్ధమైంది. అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఇప్పటికే స్వీకరించారు. అయితే ఎన్నో ఏళ్ల నుంచి పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వృద్ధులకు మాత్రం ప్రస్తుతం పింఛన్ మంజూరు చేయడం లేదని వార్తలు వస్తున్నాయి. మొదటి దశలో కేవలం వితంతు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత, గీత కార్మికులతో పాటు ఫైలేరియా, డయాలసిస్ బాధితులకు మాత్రమే కొత్త పింఛన్లు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీరి దరఖాస్తులను మాత్రమే ఆన్‌లైన్ చేయడంతో వాటిని మండలస్థాయి అధికారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం విచారణను పూర్తి చేశారు. అధికారులు దరఖాస్తు దారుల ఇంటింటికి తిరిగి వెరిఫికేషన్ పూర్తి చేశారు. ఇందుకు సంబంధించి వివరాలన్నీ ఆన్ లైన్ నమోదు చేశారు. 33 జిల్లాల పరిధిలో మొత్తం 5,98,193 దరఖాస్తులు వచ్చాయి. కొత్త పింఛన్ల కోసం వచ్చిన అర్జీల్లో సగానికి పైగా వితంతువుల నుంచే వచ్చాయి. చాలా కాలంగా కొత్త పింఛన్లు మంజూరు కాకపోవడంతో అర్హులైన మహిళలు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం దరఖాస్తుల్లో వితంతువుల వాటానే 55 శాతానికి పైగా ఉందని అధికారులు చెబుతున్నారు. రూ. 4.39 లక్షల నుంచి రూ. 2.25 లక్షలకు పడిపోయిన వెండి ధర.. కొనుగోలుపై నిపుణులు కీలక సూచన.. ఆ తర్వాతి స్థానంలో దివ్యాంగులు ఉన్నారు. మొత్తం 5,98,193 దరఖాస్తుల్లో వితంతువుల అర్జీలు 3,31,236 ఉండగా.. దివ్యాంగులు 1,48,882, ఒంటరి మహిళలు 62,689, గీత కార్మికులు 37,381, చేనేత కార్మికులు 18,005 మంది దరఖాస్తు చేసుకున్నారు. పింఛన్ల దరఖాస్తుల్లో హైదరాబాద్ జిల్లాను 46,540 అప్లికేషన్లు రాగా.. ములుగు జిల్లా కేవలం 4,818 దరఖాస్తులు వచ్చాయి. అలాగే రంగారెడ్డి జిల్లాలో 38,293, నల్గొండ 32,993, మేడ్చల్ -మల్కాజిగిరి 32,968, ఖమ్మం 27,772 జిల్లాల నుంచి అప్లికేషన్లు వచ్చాయి. భూపాలపల్లి, ఆసిఫాబాద్ జిల్లాల నుంచి పది వేల కంటే తక్కువ దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికే అన్ని జిల్లాల్లో వెరిఫికేషన్ పూర్తి అయింది. ప్రభుత్వం దసరా పండుగ కానుకగా అర్హులైన పేదలకు నూతన పింఛన్లు అందించేందుకు వేగంగా చర్యలు తీసుకుంటోంది. క్షేత్రస్థాయిలో పూర్తి పారదర్శకతతో దరఖాస్తుల విచారణ పూర్తి చేసి, ఏ ఒక్క అర్హుడికి అన్యాయం జరగకుండా లబ్ధిదారులను ఎంపిక చేస్తోంది. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టి, భాసటగా నిలిచేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. పండుగ వెలుగుల్లో ప్రతీ పేద కుటుంబం సంతోషంగా ఉండాలనే సత్సంకల్పంతో ఈ పింఛన్ల ప్రక్రియను శరవేగంగా కొలిక్కి తెచ్చింది. దసరాకు ముందు కొత్త పింఛన్లు మంజూరు చేయాలని చూస్తోంది. అక్టోబర్ 10 నుంచి 18 మధ్య కొత్త పింఛన్ల మంజూరు చేసే అవకాశం ఉంది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి.

# జియో ఐపీఓ ఒక్కో షేరు ధర ఎంతంటే.. గ్రే మార్కెట్ లో ప్రీమియంలో ట్రేడవుతున్న షేర్లు..!




రిలయన్స్ ఇండస్ట్రీస్ మద్దతు ఉన్న డిజిటల్ సేవల దిగ్గజం జియో ప్లాట్‌ఫామ్స్ అతిపెద్ద ఐపీఓ వచ్చే అవకాశంఉంది. బిజినెస్ వెబ్ సైట్ల ప్రకారం అక్టోబర్ రెండో వారంలో ఈ సంస్థ తన తుది ఆఫర్ పత్రాలను సెబీకి దాఖలు చేయనుంది. ఈ కంపెనీ ఇప్పటికే తన విదేశీ రోడ్‌షోలను ముగించింది. జూన్‌లో జియో ప్లాట్‌ఫామ్స్ తన ముసాయిదా ఐపీఓ పత్రాలను దాఖలు చేసిన తర్వాత ఆగస్టు 28న సెబీ తన తుది పరిశీలనలను జారీ చేసింది. ఈ పబ్లిక్ ఆఫరింగ్ ద్వారా దాదాపు వి3.8 బిలియన్లను సమీకరించే అవకాశం ఉంది. ఇష్యూ తర్వాత తన ఈక్విటీ బేస్‌లో సుమారు 2.9 శాతానికి సమానమైన 27 కోట్ల వరకు కొత్త ఈక్విటీ షేర్లను జారీ చేయాలని కంపెనీ ప్రతిపాదిస్తోంది. జియో ప్లాట్‌ఫామ్స్‌లో భారతదేశపు అతిపెద్ద టెలికాం ఆపరేటర్ అయిన రిలయన్స్ జియో ఇన్ఫోకామ్‌తో సహా రిలయన్స్ డిజిటల్ వ్యాపారాలు ఉన్నాయి. 2026 ఆర్థిక సంవత్సరానికి జియో ప్లాట్‌ఫామ్స్ పన్ను తర్వాత లాభంలో 15 శాతం పెరుగుదలను నమోదు చేసి రూ.30,053 కోట్లకు చేరుకుంది. అదే సమయంలో ఆదాయం 14.5% పెరిగి రూ.1,46,885 కోట్లకు చేరింది. అంచనా వేసినట్లుగా ప్రారంభమైతే, ఈ ఐపీఓ 2008 తర్వాత రిలయన్స్ గ్రూప్ మొదటి పబ్లిక్ ఆఫరింగ్ అవుతుంది. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ నేటి జీఎంపీ లేదా గ్రే మార్కెట్ ప్రీమియం ౦150గా ఉంది. గత మూడు సెషన్లలో ఐపీఓ జీఎంపీ స్థిరంగా కొనసాగుతోంది. ఇన్వెస్టర్లకు పండుగలాంటి వార్త.. రూ.37 వేల కోట్ల జియో ఐపీఓ..! ప్రస్తుత ఐపీఓ గ్రే మార్కెట్ ప్రీమియం రూ.150 వద్ద ఉంది. ఇది గ్రే మార్కెట్‌లోని స్థిరమైన సెంటిమెంట్‌ను ప్రతిబింబిస్తుంది. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ అక్టోబర్ 21న సబ్‌స్క్రిప్షన్ కోసం ప్రారంభమయ్యే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. ఈ డిజిటల్ సేవల దిగ్గజం షేర్లు అక్టోబర్ 28న స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ అయ్యే అవకాశం ఉంది. జూన్ 2026లో సెబీకి సమర్పించిన కంపెనీ డీఆర్‌హెచ్‌పి ప్రకారం, జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓలో ప్రస్తుత రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) వాటాదారుల కోసం ఒక షేర్‌హోల్డర్ రిజర్వేషన్ కేటగిరీ ఉంటుంది. రికార్డ్ తేదీ నాటికి తమ డీమ్యాట్ ఖాతాలో కనీసం ఒక రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరును కలిగి ఉన్నట్లయితే, ఆర్‌ఐఎల్ వాటాదారులు ఈ రిజర్వ్ కేటగిరీకి అర్హులు అవుతారు. రికార్డ్ తేదీని ఇంకా ప్రకటించలేదు. ఈ విషయాన్ని తుది రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ లో పేర్కొంటారు. అర్హులైన ఆర్‌ఐఎల్ వాటాదారులు, ఇష్యూ తుది నిబంధనలకు లోబడి షేర్‌హోల్డర్ రిజర్వేషన్, రెగ్యులర్ రిటైల్ కేటగిరీల కింద దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ రెండు దరఖాస్తులను వేర్వేరు కేటగిరీలుగా పరిగణిస్తారు. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ ధరల శ్రేణిని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. అయితే, మార్కెట్ వర్గాలు, మీడియా నివేదికల ప్రకారం ఒక్కో ఈక్విటీ షేరుకు ఇష్యూ ధర రూ.1,300- రూ.1,450 మధ్య ఉంటుందని అంచనా. గ్రే మార్కెట్‌లో ప్రీమియంలో ట్రేడవుతోన్న ఓరియంట్ కేబుల్స్ షేర్లు..! డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# రాయలసీమ మీదుగా బెంగళూరుకు వందే భారత్ స్లీపర్ ట్రైన్.. ఈ నెలలోనే ప్రారంభం..!



కేఎస్ఆర్ బెంగళూరు నుంచి ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ (సీఎస్ఎంటీ) మధ్య కొత్త వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ త్వరలో ప్రారంభం కానుంది. రైల్వే బోర్డు ఈ సర్వీసుకు ఆమోదం తెలిపింది. ప్రారంభం తేదీ సమయాలను ఇంకా ఖరారు చేయలేదు. ఈ నెలలోనే ఈ ట్రైన్ నడపాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సర్వీస్ ప్రారంభం అయితే.. ఇది దేశంలో రెండవ వందే భారత్ స్లీపర్ అవుతుంది. వందే భారత్ స్లీపర్ రైలులో ముంబై నుంచి బెంగళూరుకు 16 గంటల్లో చేరుకోవచ్చు. ఇది భారతదేశంలోని ఆర్థిక, టెక్ హబ్‌ల మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. ఈ రైలు ఈ నెల చివరలో తన కార్యకలాపాలను ప్రారంభించవచ్చని 'ది హిందూ' నివేదించింది. ఈ సర్వీసు వారానికి ఆరు రోజులు నడవచ్చని పేర్కొంది. బెంగళూరు నుంచి వచ్చే రైలు సోమవారాలు మినహా అన్ని రోజులూ నడుస్తుందని తెలిపింది. ముంబై-బెంగళూరు రైలు మంగళవారాలు మినహా ప్రతిరోజూ నడిచే అవకాశం ఉంది. పత్రిక ప్రకారం బెంగళూరు-ముంబై రైలు రాత్రి 10 గంటలకు బయలుదేరుతుంది. ఇది మరుసటి రోజు మధ్యాహ్నం 1:50 గంటలకు సీఎస్ఎంటీ చేరుకుంటుంది. గుడ్ న్యూస్.. బెంగళూరు అర్బన్ జిల్లా ప్రాంతాలకు కొత్త రోడ్ గ్రిడ్..! ముంబై-బెంగళూరు రైలు రాత్రి 10:30 గంటలకు సీఎస్ఎంటీ నుంచి బయలుదేరి, మరుసటి రోజు మధ్యాహ్నం 2:50 గంటలకు గమ్యస్థానానికి చేరుకుంటుంది. ఈ సర్వీసు కోసం రెండు వందే భారత్ స్లీపర్ రైలు సెట్లను ఉపయోగిస్తామని రైల్వే బోర్డు తెలిపింది. నీటి సరఫరా, ఇతర టెర్మినల్ సంబంధిత ఏర్పాట్ల కోసం, బోర్డు సోలాపూర్, పూణేలను ప్రదేశాలుగా గుర్తించింది. ప్రతిపాదిత రైలు అనంతపురం, రాయచూర్, గుంతకల్, కలబురగి, సోలాపూర్, పూణే, కళ్యాణ్‌లో ఆగుతుంది. ఈ రైలు రాయలసీమ మీదుగా ప్రయాణిస్తుంది. ప్రస్తుతం ముంబై, బెంగళూరు మధ్య ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్ అనే ఒకే ఒక డైరెక్ట్ రైలు ఉంది. ఈ రైలుకు సగటున 24 గంటల సమయం పడుతుంది. ప్రతిపాదిత వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ ముంబై, బెంగళూరు మధ్య రాత్రిపూట రైలు అనుసంధానాన్ని అందిస్తుంది. ఈ ప్రయాణం మహారాష్ట్ర, కర్ణాటకలోని ప్రధాన నగరాలు, రైల్వే హబ్‌లను కలుపుతుంది. ఈ రైలు వేగవంతమైన ప్రయాణాన్ని, మెరుగైన ప్రయాణీకుల సౌకర్యాన్ని అందిస్తుంది. రైలులో సీసీటీవీ నిఘా, ఆటోమేటిక్ స్లైడింగ్ డోర్లు, బయో-వ్యాక్యూమ్ టాయిలెట్లు వంటి ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. వందే భారత్‌లో క్యాటరింగ్ సదుపాయం కూడా ఉంటుంది. ప్రయాణికులకు డిజిటల్ సమాచార ప్రదర్శనలు, సెన్సార్ ఆధారిత నీటి కుళాయిలు, మొబైల్ ఛార్జింగ్ పాయింట్లు కూడా ఉంటాయి. మెరుగైన భద్రత కోసం, ఈ రైలులో స్వదేశీ కవచ్ ఆటోమేటిక్ రైలు రక్షణ వ్యవస్థతో పాటు, అత్యవసర టాక్-బ్యాక్ సౌకర్యాలు కూడా అమర్చారు. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి.

# భారత డ్రెస్సింగ్ రూమ్‌లో విభేదాలు.. హర్మన్ కెప్టెన్సీ వదులుకోవడానికి కారణమిదేనా..



భారత మహిళల క్రికెట్ జట్టులో ఒక ముఖ్యమైన అధ్యాయం ముగిసింది. సుదీర్ఘకాలంగా జట్టుకు నాయకత్వం వహించిన హర్మన్‌ప్రీత్ కౌర్ (37) అన్ని ఫార్మాట్ల కెప్టెన్సీ నుంచి తప్పుకుంది. ఆమె స్థానంలో స్టార్ ఓపెనర్, జట్టులో అత్యుత్తమ బ్యాటర్‌గా పేరున్న స్మృతి మంధాన (30)ను కొత్త కెప్టెన్‌గా నియమిస్తున్నట్టు బీసీసీఐ ప్రకటించింది. ఇటీవల జపాన్‌లో జరిగిన ఆసియా క్రీడల్లో భారత జట్టు వరుసగా రెండోసారి స్వర్ణ పతకం గెలిచిన తర్వాత హర్మన్‌ప్రీత్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.గువాహటిలో బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా నేతృత్వంలో జరిగిన సమీక్షా సమావేశం తర్వాత హర్మన్‌ప్రీత్ తన రాజీనామాను ప్రకటించింది. కెప్టెన్సీ మార్పు అనివార్యమని ఈ సమావేశంలో ఆమెకు స్పష్టం చేయడంతో, హర్మన్‌ప్రీత్ స్వయంగా తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. 2016 నుంచి జట్టును నడిపిస్తున్న ఆమె, ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందించింది.2013లో అరంగేట్రం చేసిన స్మృతి మంధాన, తన సొగసైన బ్యాటింగ్‌తో ప్రపంచంలోని మేటి క్రీడాకారిణుల్లో ఒకరిగా ఎదిగింది. అంతర్జాతీయ క్రికెట్‌లో 10,000 పరుగులకు పైగా సాధించిన ఆమె, హర్మన్ తర్వాత కెప్టెన్సీకి సహజమైన ఎంపికగా నిలిచింది. అయితే, ఈ పదవి ఆమెకు కాస్త ఆలస్యంగా దక్కిందనే వాదన బలంగా వినిపిస్తోంది. గత ఏడాది స్వదేశంలో వన్డే ప్రపంచకప్ గెలిచిన తర్వాత కూడా సెలక్టర్లు నాయకత్వ మార్పుపై దృష్టి పెట్టకపోవడంతో మంధాన అసహనానికి గురైనట్టు వార్తలొచ్చాయి. ఇటీవలి ఇంటర్వ్యూలలో కెప్టెన్సీకి తాను సిద్ధంగా ఉన్నానని, భారత్ మరింత పెద్ద టోర్నీలు గెలవాలని ఆమె వ్యాఖ్యానించింది.ఈ నాయకత్వ మార్పు వెనుక జట్టులోని అంతర్గత పరిణామాలు కూడా ఉన్నాయని తెలుస్తోంది. కొంతకాలంగా హర్మన్‌ప్రీత్, స్మృతి మంధాన మధ్య సత్సంబంధాలు లేవని, ఇద్దరి మధ్య తీవ్రమైన విభేదాలు ఉన్నాయని ఓ జట్టు సభ్యుడు వెల్లడించారు. ఈ పరిణామం డ్రెస్సింగ్ రూమ్‌లో అసౌకర్య వాతావరణానికి దారితీసిందని సమాచారం. భారత మహిళల క్రికెట్‌లో నాయకత్వ మార్పు వివాదాస్పదం కావడం ఇది తొలిసారి కాదు. 2022లో మిథాలీ రాజ్ నుంచి హర్మన్‌ప్రీత్ కెప్టెన్సీ స్వీకరించిన సమయంలోనూ ఇలాంటి పరిస్థితులే తలెత్తాయి.మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "రెండు, మూడేళ్ల క్రితమే మంధానకు వన్డే కెప్టెన్సీ ఇస్తారని భావించాను" అని ఆమె గతంలో వ్యాఖ్యానించింది. ఇప్పుడు హర్మన్‌ప్రీత్ మరో రెండు, మూడేళ్లు ఆటలో కొనసాగాలని భావిస్తున్న నేపథ్యంలో, కొత్త కెప్టెన్ మంధానతో కలిసి ఆమె ఎలా పనిచేస్తారనేది ఆసక్తికరంగా మారింది. కేవలం బ్యాటర్‌గా జట్టులో కొనసాగనున్న హర్మన్‌పై అంచనాలు మరింత పెరగనున్నాయి. జట్టులో స్థానం నిలబెట్టుకోవాలంటే ఆమె తన ఆటతీరును గణనీయంగా మెరుగుపరుచుకోవాల్సి ఉంటుంది.

# కోచ్ రెండుసార్లు మాట తప్పారు.. క్రిస్టియానో రొనాల్డో సంచలన ఆరోపణ



పోర్చుగల్ ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో జాతీయ జట్టు క్యాంప్ నుంచి అర్థాంతరంగా నిష్క్రమించడంపై నెలకొన్న వివాదానికి తెరదించాడు. ఈ ఘటనపై మౌనం వీడుతూ అక్టోబర్ 6న ఇన్‌స్టాగ్రామ్‌లో సుదీర్ఘమైన ప్రకటన విడుదల చేశాడు. కోచ్ జోర్జ్ జీసస్ రెండుసార్లు తనకు ఇచ్చిన మాట తప్పారని సంచలన ఆరోపణలు చేసిన రొనాల్డో, తాను చేసింది తప్పేనని అంగీకరిస్తూ.. క్షమాపణలు చెప్పాడు. పోర్చుగల్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ (ఎఫ్‌టీఎఫ్) ఏ శిక్ష విధించినా స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశాడు.

**అసలేం జరిగిందంటే..**

తన 2,000 పదాల సుదీర్ఘ పోస్టులో రొనాల్డో అసలు ఏం జరిగిందో వివరించాడు. సెప్టెంబర్ 27న నార్వేతో జరిగిన మ్యాచ్‌లో కనీసం 30 నిమిషాలు ఆడిస్తానని కోచ్ జీసస్ తనకు హామీ ఇచ్చారని, హాఫ్‌టైమ్ నుంచి వార్మప్ చేసినా మైదానంలోకి దించలేదని పేర్కొన్నాడు. ఆ తర్వాత అల్-నసర్ స్పోర్టింగ్ డైరెక్టర్ సిమావో కౌటిన్హో సమక్షంలో జరిగిన సమావేశంలో ఈ విషయంపై మీడియాకు సరైన వివరణ ఇస్తానని అంగీకరించిన కోచ్, ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాత్రం అందుకు విరుద్ధంగా, దూకుడుగా మాట్లాడారని ఆరోపించాడు. కోచ్ ప్రవర్తన వల్లే తాను తీవ్ర నిరాశతో డెన్మార్క్ మ్యాచ్‌కు ముందే క్యాంప్ వదిలి వెళ్లాల్సి వచ్చిందని తెలిపాడు.

**క్షమాపణలు, శిక్షకు సిద్ధం**

"నేను చేసింది తప్పే. నా బాధ్యత పూర్తిగా నాదే. అలా చేసి ఉండాల్సింది కాదు" అని రోనాల్డో తన తప్పును అంగీకరించాడు. క్యాంప్ వదిలి వెళ్లినందుకు జట్టు సహచరులకు, మ్యాచ్ తర్వాత పలకరించనందుకు అభిమానులకు క్షమాపణలు చెప్పాడు. తనపై పోర్చుగల్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ (ఎఫ్‌పీఎఫ్) చర్యలు తీసుకోవాలని, తాను జట్టు కెప్టెన్ అయినప్పటికీ శిక్షలో ఎలాంటి మినహాయింపు ఇవ్వకూడదని కోరాడు.

**రిటైర్మెంట్ లేదు..**

ఈ వివాదంతో తన అంతర్జాతీయ కెరీర్ ముగిసిపోలేదని రొనాల్డో స్పష్టం చేశాడు. "నేను రిటైర్ కావడం లేదు. శిక్ష పూర్తయ్యాక, ఫిట్‌గా ఉండి, క్లబ్‌లో గోల్స్ కొడుతుంటే జాతీయ జట్టుకు మళ్లీ అందుబాటులో ఉంటాను" అని భరోసా ఇచ్చాడు. మరోవైపు, ఈ వివాదంపై గతంలో స్పందించిన కోచ్ జీసస్, రొనాల్డోతో తనకు ఎలాంటి విభేదాలు లేవని, జట్టులోకి అతని పునరాగమనానికి తలుపులు తెరిచే ఉంటాయని అన్నారు. అయితే, జట్టులో అందరికీ ఒకే నిబంధనలు వర్తిస్తాయని కూడా ఆయన స్పష్టం చేశారు.ప్రస్తుతం రొనాల్డో తన క్లబ్ అల్-నసర్‌తో కలిసి శిక్షణ ప్రారంభించాడు. పోర్చుగల్ జట్టు నేషన్స్ లీగ్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించింది. రొనాల్డోపై ఎఫ్‌పీఎఫ్ ఎలాంటి శిక్ష విధిస్తుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. జీసస్ కోచ్‌గా ఉన్నంత కాలం రొనాల్డో జాతీయ జట్టులోకి తిరిగి రావడం కష్టమనే విశ్లేషణలు కూడా వినిపిస్తున్నాయి. ఎఫ్‌పీఎఫ్ నిర్ణయం తర్వాత ఈ వివాదంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# భువీ రీఎంట్రీ వెనుక అసలు కథ ఇదే.. అగార్కర్ వెళ్లాకే ఛాన్స్!



దాదాపు నాలుగేళ్ల తర్వాత టీమిండియాలోకి స్టార్ పేసర్ భువనేశ్వర్ కుమార్ తిరిగొచ్చాడు. న్యూజిలాండ్‌తో జరగనున్న ఐదు టీ20ల సిరీస్‌కు అతడిని ఎంపిక చేశారు. అయితే ఇప్పటి వరకు అతడిని దూరం పెట్టడం వెనక మాజీ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ వైఖరి కీలకంగా మారినట్లు సమాచారం.గత ఐపీఎల్ సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండో టైటిల్ గెలిచిన విషయం తెలిసిందే. ఈ విజయంలో భువీ కీలక పాత్ర పోషించాడు. 17 వికెట్లు పడగొట్టాడు. పవర్‌ప్లేలో స్వింగ్, సీమ్‌తో స్టార్ బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. అయినా అగార్కర్ హయాంలోని జాతీయ జట్టు సెలెక్టర్లు అతడికి అవకాశం ఇవ్వలేదు.భువీ ఎంపిక కోసం సెంట్రల్ జోన్ సెలెక్టర్ రుద్ర ప్రతాప్ సింగ్ ప్రయత్నించినా పెద్దగా మద్దతు లభించలేదని తెలుస్తోంది. అగార్కర్ తప్పుకొన్న తర్వాత పరిస్థితి మారింది. తాత్కాలిక చీఫ్ సెలెక్టర్ ప్రజ్ఞాన్ ఓజాతో పాటు ఇతర సెలెక్టర్లను భువీ అనుభవం గురించి చెప్పి ఒప్పించడం సులువైందని సమాచారం.భువనేశ్వర్‌ను అగార్కర్ లెక్కలోకి తీసుకోకపోవడానికి ప్రత్యేకంగా వ్యక్తిగత కారణాలేమీ లేవని విశ్లేషకులు అంటున్నారు. అగార్కర్ సెలెక్షన్ విధానం పూర్తిగా భవిష్యత్తు జట్టును నిర్మించే దిశగా సాగిందని వివరించారు. ఈ క్రమంలోనే సీనియర్ ఆటగాళ్ల విషయంలో ఆయన నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ కఠినంగా వ్యవహరించాల్సి వచ్చిందనేనది విశ్లేషణ.జస్‌ప్రీత్ బుమ్రా అందుబాటులో లేని సమయంలో భువీ అనుభవం జట్టుకు ఉపయోగపడుతుందని సెలెక్టర్లు భావించారు. యువ పేసర్లు మయాంక్ యాదవ్, ప్రిన్స్ యాదవ్‌కు అతడి అనుభవం మార్గదర్శకంగా నిలుస్తుందని భావిస్తున్నారు. వీరిద్దరినీ 2028 టీ20 ప్రపంచకప్ కోసం భారత్ ఆశిస్తున్న ఆటగాళ్లుగా చూస్తున్నారు.భువీ ఇప్పటివరకు 21 టెస్టులు, 121 వన్డేలు, 87 టీ20లు ఆడాడు. టీ20ల్లో 90 వికెట్లు తీసుకున్నాడు. అతడి రీఎంట్రీతో మహ్మద్ షమీకీ జాతీయ జట్టులోకి తిరిగి రావాలనే ఆశలు పెరిగే అవకాశం ఉంది.న్యూజిలాండ్‌తో తొలి టీ20 అక్టోబర్ 22న క్రైస్ట్‌చర్చ్‌లో జరుగుతుంది. రెండో మ్యాచ్ అక్టోబర్ 24న అక్కడే ఉంటుంది. అక్టోబర్ 27న వెల్లింగ్టన్‌లో మూడో టీ20, అక్టోబర్ 30న ఆక్లాండ్‌లో నాలుగో మ్యాచ్ జరగనున్నాయి. నవంబర్ 1న హామిల్టన్‌లో చివరి టీ20తో సిరీస్ ముగుస్తుంది.



## రవితేజ సినిమాలో జేడీ చక్రవర్తి..
## కాకపోతే 26 ఏళ్ల తర్వాత మారిన సీన్ !

సినీ పరిశ్రమలో కాలం ఎవరిని ఎప్పుడు ఎక్కడ నిలబెడుతుందో చెప్పడం కష్టం. ఒకప్పుడు చిన్న పాత్రల్లో కనిపించిన నటులే తర్వాత స్టార్ హీరోలుగా ఎదుగుతుంటారు. అలాగే స్టార్ హీరోలుగా ఉన్నవారు కాలక్రమంలో విభిన్నమైన పాత్రలు చేస్తూ తమ కెరీర్‌ను కొనసాగిస్తుంటారు. ఇప్పుడు టాలీవుడ్‌లో వినిపిస్తున్న ఓ ఆసక్తికరమైన కాంబినేషన్ కూడా ఇదే విషయాన్ని గుర్తు చేస్తోంది. మాస్ మహారాజా రవితేజ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాలో సీనియర్ నటుడు జేడీ చక్రవర్తి కీలక పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఒకవేళ ఈ వార్త నిజమైతే.. దాదాపు 26 ఏళ్ల తర్వాత రవితేజ, జేడీ చక్రవర్తి ఒకే సినిమాలో మరోసారి కలిసి కనిపించబోతున్నారు. అయితే ఈసారి మాత్రం అప్పటి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. రవితేజ ఇప్పుడు టాలీవుడ్‌లో మాస్ మహారాజాగా ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకోగా.. జేడీ చక్రవర్తి కీలక పాత్రలు, ప్రతినాయక పాత్రలతో ప్రేక్షకులను మెప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. 1999లో ఎస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన 'ప్రేమకు వేళాయెరా' సినిమా అప్పట్లో మంచి విజయాన్ని అందుకుంది. ఆ సమయంలో జేడీ చక్రవర్తి స్టార్ హీరోగా వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. అదే సినిమాలో రవితేజ మాత్రం చిన్న సహాయ పాత్రలో కనిపించారు. ఆ తర్వాత రవితేజ కెరీర్ క్రమంగా మరో మలుపు తిరిగింది. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన 'ఇట్లు శ్రావణి సుబ్రమణ్యం' మొదట జేడీ చక్రవర్తి వద్దకు వెళ్లినప్పటికీ.. చివరకు రవితేజ హీరోగా ఆ సినిమా తెరకెక్కింది. ఈ చిత్రం రవితేజ కెరీర్‌కు కీలకమైన మలుపుగా నిలిచింది. 2007లో శ్రీను వైట్ల దర్శకత్వంలో వచ్చిన 'దుబాయ్ శీను'లో రవితేజ అప్పటికే పూర్తిస్థాయి స్టార్ హీరోగా ఎదిగారు. అదే సినిమాలో జేడీ చక్రవర్తి ఫ్లాష్‌బ్యాక్‌కు సంబంధించిన చిన్న పాత్రలో కనిపించారు. ఇలా ఇద్దరి కెరీర్ ప్రయాణాన్ని గమనిస్తే.. కాలంతో పాటు వారి స్థానాలు ఎలా మారాయో స్పష్టంగా కనిపిస్తుంది. ఇప్పుడు మరోసారి వీరిద్దరూ ఒకే సినిమాలో కనిపించనున్నారనే వార్త రావడంతో అభిమానుల్లో ఆసక్తి మొదలైంది. ముఖ్యంగా జేడీ చక్రవర్తి రవితేజకు ఎదురుగా ప్రతినాయకుడి పాత్రలో కనిపిస్తే.. ఈ కాంబినేషన్ మరింత ప్రత్యేకంగా మారే అవకాశం ఉంది. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ సినిమాకు 'తులాభారం' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. రవితేజ ఇంతకుముందు చేయని తరహాలో హారర్, కామెడీ, సస్పెన్స్ థ్రిల్లర్ అంశాలను కలిపి ఈ కథను రూపొందిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది.వివేక్ ఆత్రేయకు ఉన్న ప్రత్యేకమైన హ్యూమర్‌తో పాటు మైండ్ గేమ్ తరహా కథనాన్ని రవితేజ ఎనర్జీకి జోడించి ఈ సినిమాను తెరకెక్కించనున్నట్లు సమాచారం. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే అంచనాలు ఏర్పడుతున్నాయి. ఈ చిత్రంలో ప్రియాంక అరుళ్ మోహన్, అనస్వర రాజన్ కథానాయికలుగా నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇద్దరి పాత్రలకు కథలో ప్రాధాన్యత ఉంటుందని సమాచారం. ఇప్పటికే వీరి కాంబినేషన్ కూడా సినిమాపై ఆసక్తిని పెంచుతోంది.

## శ్రీవిష్ణు 'కామ్రేడ్ కళ్యాణ్' ట్రైలర్ విడుదల..
### థియేటర్లలో నవ్వులు గ్యారెంటీ!




టాలీవుడ్ హీరో శ్రీవిష్ణు నటిస్తున్న తాజా చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్'. ఈ సినిమా మేకర్స్ అఫీషియల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. జానకిరామ్ మర్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రముఖ రచయిత, నిర్మాత కోన వెంకట్ సమర్పిస్తున్న ఈ సినిమాను కోన ఫిల్మ్ కార్పొరేషన్, స్కంద వాహన మోషన్ పిక్చర్స్ బ్యానర్లపై నిర్మిస్తున్నారు. 1990ల కాలం నాటి ఆంధ్ర-ఒడిశా సరిహద్దు మాడుగుల గ్రామం నేపథ్యంలో సాగే ఈ కథ, పూర్తి స్థాయి పీరియాడికల్ యాక్షన్-కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోంది. శ్రీవిష్ణు తనదైన శైలిలో వినోదం పండిస్తూనే, సరికొత్త షేడ్స్‌లో ప్రేక్షకులను అలరించనున్నారు. ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తుండగా, ఇటీవల సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా ఖా 16ం సర్టిఫికెట్‌ను సొంతం చేసుకుంది. భారీ అంచనాల నడుమ ఈ చిత్రం అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.



## కేరాఫ్ కంచరపాలెం డైరెక్టర్ కొత్త మూవీ..
### హీరోయిన్‌గా పుష్ప-2 ఫేమ్

కేరాఫ్ కంచరపాలెం మూవీతో సూపర్ హిట్ అందుకున్న డైరెక్టర్ వెంకటేశ్ మహా. ఈ చిత్రంతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారు. ఆయన తాజాగా మరో చిత్రాన్ని ప్రకటించారు. సరికొత్త కథతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. తాజా చిత్రానికి అట్టహాసం అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. దీంతో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. కంచరపాలెం తరహాలోనే ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మూవీలో కేరాఫ్ కంచరపాలెం ఫేమ్ కార్తీక్ రత్నం, పుష్ప ఫేమ్ పావని కరణం ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. వీరితో దర్శకుడు వెంకటేశ్ మహా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ స్రవంతి పెపకాయల కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ మూవీని చింతా గోపాలకృష్ణ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి స్మరణ్ సంగీతం అందిస్తున్నారు. 2027 వేసవి కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తెచ్చేలా ప్లాన్ చేస్తున్నారు.

## కల్ట్ బాయ్స్ రీఎంట్రీ..
### రెట్టింపు వినోదంతో 'హుషారు 2' రాక!

టాలీవుడ్ యువతను ఒక ఊపు ఊపేసిన ఐకానిక్ యూత్‌ఫుల్ ఫ్రాంచైజీ 'హుషారు' మరోసారి థియేటర్లలో సందడి చేసేందుకు సర్వం సిద్ధం చేసుకుంటోంది. 2018లో ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలై బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టించిన ఈ సినిమా, యూత్ కల్చర్‌కు కొత్త అర్థం చెప్పింది. ఇప్పుడు అదే జోరును కంటిన్యూ చేస్తూ, దర్శకుడు శ్రీహర్ష కొనుగంటి ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'హుషారు 2'ను అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు విడుదల చేసిన టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతూ, సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చింది. ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్ చూస్తేనే మేకర్స్ ఎలాంటి డిఫరెంట్ కాన్సెప్ట్‌తో వస్తున్నారో అర్థమవుతోంది. మొదటి భాగంలో ఐదుగురు స్నేహితులు తయారు చేసిన 'కబూమ్' బీరు ఉన్న ట్రక్కును కొందరు బలవంతంగా లాగుతుండగా, వారి మధ్యలో ఒక పెద్ద పాము చిక్కుకుని భయపెడుతున్నట్లుగా డిజైన్ చేశారు. ట్రక్కు కింద తాబేలు, కాస్త దూరంలో బంగారు నగల పెట్టె, వెనుక ఒక ఫ్యాక్టరీ ఉండటం ఈ పోస్టర్‌కు మరింత ఇంటెన్సిటీని తెచ్చాయి. ఇది హిందూ పురాణాల్లోని క్షీర సాగర మథనం (దేవతలు, రాక్షసులు అమృతం కోసం చేసిన మథనం)ను తలపించేలా ఉండటంతో, ఈ కథకు అమృత మథనానికి మధ్య ఉన్న లింక్ ఏంటనే క్యూరియాసిటీ ప్రేక్షకుల్లో విపరీతంగా పెరిగిపోతోంది. దీనికి సమాధానం తెలియాలంటే సినిమా విడుదల వరకు ఆగాల్సిందే. మొదటి భాగం అందించిన ఎనర్జీకి మించి, ఈ సీక్వెల్‌లో డబుల్ ఫన్, నాన్‌స్టాప్ మ్యాడ్‌నెస్‌తో పాటు సరికొత్త యూత్‌ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఉండబోతుందని చిత్ర యూనిట్ స్పష్టం చేసింది. ఒరిజినల్ క్రియేటర్ శ్రీహర్ష కొనుగంటి మరోసారి మెగాఫోన్ పట్టుకుని ఆధునిక సంబంధాలు, కాలేజీ కుర్రాళ్ల అల్లరిని మరింత వినూత్నంగా వెండితెరపై ఆవిష్కరించనున్నారు. ఈ చిత్రంలో రాహుల్ రామకృష్ణ, అశోక్ గల్లా, రవి అంథోని, దినేష్ తేజ్, శశిధర్ కొచర్లకోట, విధి యాదవ్, అభిజ్ఞ ఉతులూరు, భగవాన్ తివారి, జతిన్ గోసామి, రజయ్ రోవన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సాంకేతిక నిపుణుల విషయానికొస్తే.. కేవ్‌మ్యాన్ స్టోరీస్, హెచ్‌కె ఫిల్మ్స్, కలియుగ వారధి క్రియేషన్స్ సంయుక్తంగా ఈ సినిమాను అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. రాహుల్ వర్మ, కె.వీణా రాణి, కె.హనుమంత్ రాజు నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా, కోమటిరెడ్డి శరణ్ రెడ్డి సహ నిర్మాతగా ఉన్నారు. సినిమాకి సన్నీ ఎం.ఆర్ సంగీతం అందిస్తుండగా, రామ్ మిర్యాల అడిషనల్ మ్యూజిక్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. జి.శ్రీనివాస్ రెడ్డి సినిమాటోగ్రఫీ, విజయ్ వర్ధన్ కావూరి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం సినిమా ప్రధాన షూటింగ్ షెడ్యూల్స్ అన్నీ విజయవంతంగా పూర్తి చేసుకుని, శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటోంది. ప్రేక్షకులకు ఒక అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని పంచేందుకు ప్లాన్ చేస్తున్న మేకర్స్, ఈ ఏడాది చివరి నాటికి సినిమాను గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.




PUBLISHED AND OWNER BY LINGALA NARENDER Published at 10-1-1-/A, THRIMURTHY COLONY,PRIYADARSHINI PARK BESIDE,SAROOR NAGAR,RANGAREDDY District TELANGANA - 500035. Printed at SMILYSONLINE 6-7-48,VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY District,TELANGANA - 500070. EDITOR LINGALA NARENDER RNI NO. : TGTEL/25/A0357 ,CELL : 9010880040